teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151
# తీన్మార్
నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక
ములుగు | సంపుటి : 03 | సంచిక : 388 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 31 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5
Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు

కొడగట్టు ఆలయానికి మెరుగులు దిద్దుతున్న అధికారులు

గుట్టపైన వై జంక్షన్ వరకు ఉచిత బస్సు సర్వీసులు ఏర్పాటు



కొండగట్టు, మే 30 (తీన్మార్ న్యూస్): ఏటా వైశాఖ బహుళ దశమి రోజున నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంమైనవి. ఉత్సవాల సందర్భంగా అధికారులు ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుత్వికులు అంకురార్పణ చేసి ఉత్సవాలు ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో


మిగతా 2 లో

# ఉత్సవాల ముగింపు కనువిందు

కనువిందు చేయనున్న దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు

రెండు పూటలా వేడుకల అత్యంత వైభవంగా నిర్వహణ

అమరులకు నివాళ్లతో మొదలు.. ఆకాశంలో బాణాసంచాతో ముగింపు



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈసారి ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఘనంగా వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): సచివాలయంలో గురువారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖతో పాటు మాజీ మంత్రి జానారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాంతో పాటు కవి అందెశ్రీ, సంగీత దర్శకులు కీరవాణి, సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ బిల్లును ఆమోదించినప్పుడు సభలో ఉన్న మాజీ ఎంపీలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 2 లో



## రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నానికి చిక్కులు

లోగోలో మార్పులుపై బీఆర్ఎస్ నేతల ఆందోళన

బీజేపీ, బీఆర్ఎస్ మినహా ఇతర పార్టీలకు సమావేశానికి ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నానికి చిక్కులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఉన్న లోగోలో మార్పులు చేయడంపై బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లో ఆందోళన నిర్వహించారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ ఇమేజ్‌లను తొలగించడంపై వివిధ పక్షాల నుంచి విమర్శలు వచ్చాయి.

హైదరాబాద్, మే 30 (తీన్మార్ న్యూస్): కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) లోగోను పోలి ఉన్నదంటూ సోషల్ మీడియా వేదికగా సెటైర్లు కూడా వినిపించాయి. వీటన్నింటిని నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు 45 మందితో ముఖ్యమంత్రి రేవంత్ సచివాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మినహా మిగిలిన పార్టీలకు ప్రభుత్వం తరపున ఆహ్వానం వెళ్ళింది. రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా జూన్ 2న పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించే సభలో లోగో ఆవిష్కరణ ఉండకపోవచ్చని, కేవలం రాష్ట్ర గీతం లాంచింగ్ మాత్రమే ఉంటుందని ప్రభుత్వ

మిగతా 2 లో



## ఎన్‌హెచ్‌ఎంలో మూడు నెలలుగా జీతాలు లెవ్

తక్షణమే జీతాలు విడుదల చేయాలి

ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మాజీ మంత్రి హరీష్ పోస్టు

తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమని, తక్షణమే విడుదల చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా

మిగతా 2 లో

## పెండింగ్‌లో డీఏల విడుదలకు ఉద్యోగుల నిరీక్షణ

మంత్రులు, ఆఫీసర్లకు ఎంప్లాయిస్ సంఘాల విజ్ఞప్తులు

వెంటనే పెండింగ్ డీఏలను ప్రకటించాలని డిమాండ్



తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల కోసం ఎంప్లాయిస్ కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని నిరీక్షిస్తున్నారు. లోకసభ ఎన్నికల రిజల్ట్ వచ్చిన వెంటనే డీఏలు విడుదల చేయాలని, కనిపించిన మంత్రులు, ఆఫీసర్లకు విజ్ఞప్తులు సమర్పిస్తున్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు ఎంప్లాయిస్ సంఘాల ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారు. నిజానికి పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలకు

మిగతా 2 లో



## విత్తనాల పంపిణీపై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా

నకిలీవిత్తనాల విక్రయితలపై కఠిన చర్యలకు ఆదేశాలు

హైదరాబాద్, మే 30 (తీన్మార్ న్యూస్): పత్తి, పచ్చిరొట్ట లభ్యత, విత్తనాల పంపిణీపై రాష్ట్రస్థాయి అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సమీక్ష నిర్వహించారు. నకిలీవిత్తనాల విక్రయితలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ

మిగతా 2 లో



## హైదరాబాద్ చుట్టూ రియల్ వ్యాపారం జోరు

2023-24 ఆర్థిక సం.కి మొత్తం రూ.11,275 కోట్ల ఆదాయం

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానం

తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టూ రియల్ వ్యాపారం జోరు తగ్గలేదు. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విక్రయాల ద్వారా రాష్ట్ర ఖజానాకు హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల నుంచే అత్యధిక ఆదాయం సమకూరింది. ఈ జిల్లాల్లో డాక్యుమెంట్ల నమోదు కూడా

మిగతా 2 లో

## తెలంగాణ "కొత్త" గేయాన్ని ఆమోదించిన ప్రభుత్వం

జయ జయహే తెలంగాణ గీతాన్ని జాతికి అంకితం చేస్తాం

ప్రకటన విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 30 (తీన్మార్ న్యూస్): జయ జయహే తెలంగాణ గేయాన్ని ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే వేడుకల సందర్భంగా

మిగతా 2 లో



## నామినేటెడ్ చైర్మన్ల నియామకంపై సీఎం రేవంత్ ఫోకస్

లోక్ సభ, అసెంబ్లీ టికెట్లను త్యాగం చేసిన వారికి ప్రయార్టీ

రాష్ట్ర మంత్రులు, డీసీసీల నుంచి సీఎంకు చేరిన సీనియర్ నేతల పేర్లు

రాష్ట్రంలో పలు కీలకమైన కార్పొరేషన్లు, కమిషన్లకు చైర్మన్లను నియమించడంపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లు, మరికొన్ని కమిషన్లకు చైర్మన్లను నియమించింది. తాజాగా మరో 15 నుంచి 20 కార్పొరేషన్లతో పాటు కొన్ని కమిషన్లకు చైర్మన్లను నియమించేందుకు కసరత్తు మొదలుపెట్టింది.

తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): మరో వారంలో ఈ నియామకాలను పూర్తి చేయాలనే పట్టుదలతో రేవంత్ ఉన్నట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లోపు ఎలక్షన్ కోడ్ ( జూన్ 6 ) కూడా ముగియనుండడంతో ఆ వెంటనే ఆర్డర్ కాపీలను నేరుగా నేతలకు అందించనున్నారని తెలుపుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లను త్యాగం చేసిన నాయకులకు ఈ నామినేటెడ్ పోస్టుల్లో టాప్ ప్రయార్టీ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇదే సమయంలో ఈ రెండు ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ నాయకులకు కూడా ఇందులో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతలకు మాత్రం నామినేటెడ్ పదవులు

మిగతా 2 లో




## ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచడంపై సర్కార్ బడి బాట

జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం

తెలంగాణ బ్యూరో, మే 30 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచడంపై సర్కార్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం తెలంగాణ వ్యాప్తంగా చేపట్టనుంది. కాగా ఈ బడిబాట కార్యక్రమాన్ని తొలుత జూన్ 1 నుంచి 11వ తేదీ

మిగతా 2 లో

## తెలంగాణలో కొత్తగా 27 రకాల బీర్లు

ఐదు కంపెనీలకు కాంగ్రెస్ సర్కారు అనుమతి

క్రాఫ్ట్ బీర్లే అధికంగా ఉండటం విశేషం



హైదరాబాద్, మే 30 (తీన్మార్ న్యూస్): మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కొత్తగా ఐదు కంపెనీలకు కాంగ్రెస్ సర్కారు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. వీటిలో క్రాఫ్ట్ బీర్లే అధికంగా ఉండటం విశేషం. రాష్ట్రంలో బీర్ల కొరతను అధిగమించేందుకే ఎక్సైజ్శాఖ తెలంగాణలో కొత్తగా 27 రకాల బీర్లు రాబోతున్నాయి. దీనికోసం ఇప్పటికే కొత్తగా ఐదు బీర్ల

మిగతా 2 లో

## ఉపాధి హామీ పనుల్లో.. నిజాంకాలం నాటి నాణేలు

పాత్రలో పురాతన 25 వెండి నాణేలు, 2వెండి ఉంగరాలు



సిద్దిపేట, మే 30 (తీన్మార్ న్యూస్): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయిపల్లి గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలకు ఓ రాతి పాత్ర దొరికింది. దీంతో తొలుత రాతి పాత్రను ఓపెన్ చేసేందుకు కూలీలు భయపడ్డారు. కొంతమంది కూలీలు దానిని తెరిచి

మిగతా 2 లో

# ఉత్సవాల ముగింపు కనువిందు

మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. జూన్ 2న ఉదయం 9.30గంటలకు గన్ పార్క్‌లో అమర వీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి నివాళులు అర్పిస్తారు. ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. పోలీసు బలగాల పరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకార కార్యక్రమం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాన్ని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ ఆవిష్కరిస్తారు. అనంతరం సోనియాగాంధీ ప్రసంగం, ఆ తర్వాత ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. పోలీసు సిబ్బందికి, ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు స్వీకర్తలతో ఫొటో సెషన్ అనంతరం కార్యక్రమం ముగుస్తుంది. జూన్ 2 సాయంత్రం ట్యాంక్ బండ్‌పై తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ప్రారంభమవుతాయి. తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 6.30గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ ట్యాంక్ బండ్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం తెలంగాణ కళారూపాల అద్భుత ప్రదర్శనకు అద్దం పట్టే కార్నివాల్ నిర్వహిస్తారు. దాదాపు 700 మంది కళాకారులు ఇందులో పాల్గొంటారు. అనంతరం ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి. స్టేజ్ షో అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్ బండ్‌పై ఇటు చివర నుంచి అటు చివరి వారకు భారీ ఫ్లాగ్‌వాక్ నిర్వహిస్తారు. దాదాపు 5 వేల మంది ఇందులో పాల్గొంటారు. ఈ ఫ్లాగ్‌వాక్ జరుగుతున్నంతసేపు జయ జయహే తెలంగాణ ఫుల్ వర్షన్ (13.30 నిమిషాల) గీతాన్ని విడుదల చేస్తారు. అదే వేదికపై తెలంగాణ కవి శ్రీ అందెశ్రీ, సంగీత దర్శకుడు శ్రీ ఎం.ఎం. కీరవాణికి సన్మానం చేస్తారు. రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా బాణాసంచా (ఫైర్‌వర్క్స్) కార్యక్రమంతో వేడుకలను ముగిస్తారు.

**కొత్త రాజముద్ర ఆవిష్కరణ వాయిదా**

తెలంగాణ కొత్త లోగో (కొత్త రాజముద్ర) దాదాపు ఖరారయ్యిందని గత 24 గంటలుగా హడావుడి జరిగిన సంగతి తెలిసిందే. అదిగో ఇదిగో రిలీజ్ అంటూ కాంగ్రెస్ నేతల మాటలు ఇక సోషల్ మీడియాలో అయితే ఇదిగో ఇదే ఫైనల్ అని ఫొటోలు తెగ వైరల్ అయ్యాయి. అయితే తెలంగాణ కొత్త రాజముద్ర ఆవిష్కరణ వాయిదా పడింది. తొలుత జూన్- 2 రిలీజ్ చేయాలని భావించిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. జూన్-02న కాకుండా మరో రోజున రిలీజ్ చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. దీనిపై ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే.. తెలంగాణ గీతం మాత్రమే జూన్-02నే విడుదల చేస్తారని తెలుస్తోంది. అయితే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, తెలంగాణ ప్రజల్లో ఓ వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతతో ప్రభుత్వం పునరాలోచనలో పడిందనే టాక్ కూడా గట్టిగానే నడుస్తోంది.

## నామినేటెడ్ చైర్మన్ల నియామకంపై సీఎం రేవంత్ ఫోకస్

మొదటి పేజీ తరువాయి

ఇవ్వొద్దని సీఎం నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ నిబంధనల మేరకు వీరికి పదవులు ఇవ్వడం కుదరదని, తనను కలిసిన నాయకులకు రేవంత్ ఇప్పటికే స్పష్టం చేసినట్టు పీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

**కీలక కార్పొరేషన్లన్నింటికీ చైర్మన్లు**

ఆర్టీసీ, సివిల్ సప్లయ్, బేవరేజెస్, రెడ్కో ( రెన్యువబుల్ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ), మూసీ రివర్ ఫ్రంట్, హుడా ( హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ) వంటి కీలక కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడంపై సీఎం రేవంత్ దృష్టిపెట్టారు. వీటితో పాటు విద్య, వ్యవసాయ రంగాలకు ఈసారి కొత్తగా కమిషన్లు ఏర్పాటు చేసి, వాటికి అనుభవజ్ఞులైన వారిని చైర్మన్లుగా నియమించాలని భావిస్తున్నారు. విద్యకు, వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఇందులో కొన్ని సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈ రెండు శాఖలకు కమిషన్లను ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. విద్యా కమిషన్‌కు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని, వ్యవసాయ కమిషన్ కు కాంగ్రెస్ సీనియర్ నేత, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డిని నియమించనున్నారు. త్వరలో జిల్లా, మండల, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు జరగనున్నందున వాటిని దృష్టిలో పెట్టుకొని కూడా ఈ పదవుల పంపకంపై సీఎం ఫోకస్ పెట్టినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మొదటి విడతలో చాలా మంది సీనియర్లకు నామినేటెడ్ తో పాటు ఎమ్మెల్సీ , రాజ్యసభ వంటి కీలక పదవులు దక్కాయి. అప్పుడు ఆ పదవులు దక్కని మరికొందరు సీనియర్లను ఇప్పుడు మొదటి ప్రాధాన్యతగా గుర్తించి ఈ పదవుల్లో నియమించనున్నారు.

**హుడా, మూసీ రిఫర్ ఫ్రంట్‌కు చైర్మన్లు**

కరీంనగర్, వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థలకు మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. ఇప్పుడు హైదరాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ( హుడా )కి చైర్మన్‌ను నియమించాల్సి ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్నందున ఇది కూడా చాలా కీలకమైన పదవే. అందుకే ఈ పదవికోసం గ్రేటర్ పరిధిలోని పలు నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలు పైరవీలు చేస్తున్నట్టు సమాచారం. ఈ పదవి ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ సిటీ నేతల్లో నెలకొంది. ఇక మూసీ రివర్ ఫ్రంట్ చైర్మన్ పదవి కోసం కూడా గ్రేటర్ నేతలు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. రేవంత్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూసీ నది ప్రక్షాళన చేస్తామని ప్రకటించడంతోపాటు లండన్ లో పర్యటించి అక్కడ అధ్యయనం చేసి వచ్చారు. త్వరలోనే మూసీని ప్రక్షాళన చేయడంతో పాటు వందల కోట్లు ఖర్చు చేసి మూసీ పరీవాహక ప్రాంతాలను సుందరంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దీంతో ఇప్పుడు మూసీ చైర్మన్ పదవి కూడా చాలా కీలకం కానుంది. ఎన్నికల కోడ్ ముగిసేలోపు నామినేటెడ్ నియామకాలను ఫైనల్ చేసి, ఆ తర్వాత ఇక పూర్తిస్థాయిలో పాలనపై దృష్టి పెట్టేందుకు రేవంత్ సిద్ధమవుతున్నారు.

**గాంధీ భవన్‌కు చేరిన అర్హుల పేర్లు**

పదవుల కోసం ఉమ్మడి జిల్లాల్లో అర్హులైన పలువురు నాయకుల పేర్లను ఆయా జిల్లాల నుంచి మంత్రులు, డీసీసీ అధ్యక్షులు గాంధీ భవన్‌కు, సీఎంకు పంపించారు. ఒక్కో ఉమ్మడి జిల్లా నుంచి 10 నుంచి 15 మంది పేర్లు సీఎం వద్దకు చేరినట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాలవారీగా పార్టీ పదవుల్లో ఉన్న సీనియర్లను గుర్తించి, సామాజిక సమీకరణలను కూడా పరిగణనలోకి తీసుకొని వివిధ నామినేటెడ్ పోస్టుల్లో నియమించాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. ఇటు లోక్ సభ, అటు అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరిన చాలా మంది సీనియర్ నేతలు కూడా ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వారి చేరిక సమయంలో రేవంత్ ఆ మేరకు హామీ ఇచ్చారు. ఇప్పుడు వలస వచ్చిన నేతలు చాలా మంది తమకు ఇచ్చిన హామీని సీఎం దృష్టికి తీసుకెళ్లి, తమకు పదవి ఇవ్వాలని కోరుతున్నారు. మరి కొందరు నేతలు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీని కలిసి, తమకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ లోని సీనియర్ నేతలతోపాటు బీఆర్ఎస్, బీజేపీలో బలమైన నేతలుగా ఉండి, కాంగ్రెస్ లో చేరిన వారికి కూడా తగిన గౌరవం, గుర్తింపు ఇచ్చేలా కీలక కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంపై రేవంత్ కసరత్తు చేస్తున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ జడ్పీ చైర్మన్లు, పీసీసీలో ముఖ్యమైన పదవుల్లో ఉన్న నాయకులు, డీసీసీ అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో పార్టీలో బలమైన నేతలు ఈ జాబితాలో ఉన్నారు.

## ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి



సుమారు 3 నుంచి 4 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా పార్కింగ్ స్థలం నుంచి గుట్టపైన వై జంక్షన్ వరకు నాలుగు ఉచిత బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం 28 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. దీక్షాపరుల మాలవిరమణ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కేశఖండనానికి కోనేరు పక్కన స్థలం కేటాయించారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో 650 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తారు. ఆరు మెడికల్ టీం లు, ఫైరింజన్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టనున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు తెలిపారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులపాటు గుట్టపైకి రోజుకు 10 లక్షల లీటర్ల చొప్పున నీటిని సప్లై చేస్తామని భగీరథ అధికారులు తెలిపారు.

**కొండగట్టులో చిడతల రామాయణం**


కొండగట్టులో చిడతల రామాయణాన్ని కళాకారులు ప్రదర్శించారు. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం ఎంకతల గ్రామానికి చెందిన కళాకారుల బృందం బుధవారం అంజన్న సన్నిధికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో చిడతల రామాయణం ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనలో భాగంగా కళాకారుల నృత్యాలు, పాటలు కొండగట్టుకు వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**ఉత్సవాలకు ప్రత్యేక అధికారులు**

కొండగట్టు అంజన్న ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు ప్రత్యేక అధికారులుగా కృష్ణారావు, వినోద్ రెడ్డి లను నియమించినట్లు రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరు బుధవారం కొండగట్టుకు చేరుకొని అంజన్న ఆలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు.

## హైదరాబాద్ చుట్టూ రియల్ వ్యాపారం జోరు

మొదటి పేజీ తరువాయి




ఎక్కువగానే ఉంటుంది. నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయల నిర్మాణాల్లో ఈ జిల్లాలకే తొలి ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల కిందట నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ఆదాయంలో రంగారెడ్డి జిల్లా అగ్ర స్థానంలో నిలవగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చివరి స్థానానికి పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విక్రయాలతో ప్రభుత్వానికి మొత్తం రూ.11,275 కోట్లు సమకూరాయి. ఇందులో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచే అత్యధికంగా రూ.9,157 కోట్లు రాగా మిగిలిన 29 జిల్లాల నుంచి రూ.2,118 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే మొత్తం రాబడిలో ఈ నాలుగు జిల్లాల నుంచే దాదాపు 80 శాతానికి పైగా ఉంది. రాజధాని చుట్టూ స్థిరాస్తి వ్యాపారం జోరు మీద ఉండగా దూరంగా ఉన్న జిల్లాల్లో మాత్రం నామ మాత్రంగా సాగుతోంది. రెండు జిల్లాల్లో ఏడాది పొడవునా వచ్చిన ఆదాయం సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. మరో 11 జిల్లాల్లో రూ.50 కోట్ల ఆదాయం కూడా దాటలేదు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కేవలం రూ.6 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9 కోట్ల ఆదాయం వచ్చింది.

**ఆదాయంలో టాప్ 10 జిల్లాలు**

రంగారెడ్డి జిల్లాలో రూ.4,338 కోట్లు, మేడ్చల్ మల్కాజిగిరిలో 2,447 కోట్లు, హైదరాబాద్‌లో 1,408 కోట్లు, సంగారెడ్డిలో 964 కోట్లు, హనుమకొండలో 283 కోట్లు, యాదాద్రి భువనగిరిలో 193 కోట్లు, ఖమ్మంలో 170 కోట్లు, నిజామాబాద్‌లో 142 కోట్లు, కరీంనగర్‌లో 137 కోట్లు, మహబూబ్‌నగర్‌లో రూ.112 కోట్ల రాబడి వచ్చింది.

**తక్కువ ఆదాయం వచ్చిన 10 జిల్లాలు**


కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ.6 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి 9 కోట్లు, ములుగు 11 కోట్లు, నారాయణపేట 23 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం 28 కోట్లు, జోగులాంబ గద్వాల 32 కోట్లు, వరంగల్ 32 కోట్లు, నిర్మల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి రూ.38 కోట్లు చొప్పున, వనపర్తి నుంచి రూ.39 కోట్లు వచ్చాయి.

## మంత్రి పొంగులేటి నిజ స్వరూపం అంటూ లేఖ కలకలం

**ఒక సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందంటూ ఆవేదన**

**వేల కోట్ల రూ. ఎలా సంపాదించారని లేఖ సమాచారం**

**ఫ్రమ్ అడ్రసు అంటూ ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం పేరు**



ఖమ్మం, మే 30 (తీన్మార్ న్యూస్): ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిజ స్వరూపం అంటూ కొందరు లేఖలు సృష్టించడం కలకలం రేపుతోంది. ఒక సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందంటూ వాటిలో ఆవేదన వ్యక్తం చేశారు. పాలు అమ్ముకునే స్థాయి నుంచి వేల కోట్ల రూపాయలు పొంగులేటి ఎలా సంపాదించారని వాటిల్లో పేర్కొన్నారు. అప్పట్లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు చేయకుండానే ఆయన వందల కోట్ల రూపాయలు సంపాదించినట్లు లేఖలో రాసుకొచ్చారు. వైఎస్ జగన్‌కి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏజెంట్ అంటూ వారు పేర్కొన్నారు. మువ్వా విజయ్ బాబుకి సముచిత స్థానం కల్పించలేదని లేఖలో చెప్పారు. ఖమ్మంలో నిర్మించనున్న రింగ్ రోడ్ పక్కన వేల ఎకరాలు కొనుగోలు చేసేందుకు పొంగులేటి ప్రయత్నం చేశారని అందులో చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కారులో పొంగులేటిదే పెత్తనం అంటూ అందులో పేర్కొన్నారు. కమ్మ సామాజిక వర్గానికే ప్రాధాన్యం లేకపోతే మిగిలిన కులాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. లేఖలు, పీడీఎఫ్ ద్వారా ప్రచారం చేయాలంటూ లేఖల్లో పిలుపునిచ్చారు. కనగండ్ల నాగభూషణం, కనకమేడల ప్రసాద్ రావు, మేడ తిరునాదరావు, కాటేపల్లి కోటేశ్వరరావు, నల్ల మోతు కృష్ణ మూర్తి, దమ్మాలపాటి తిరుమలరావు, నూతలపాటి వెంకట అప్పారావు పేరుతో లేఖలు ఉన్నాయి. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లిలో ఈ లేఖలు కనపడ్డాయి. ప్రముఖులకు లేఖలను పోస్ట్ చేశారు. ఫ్రమ్ అడ్రసు అంటూ ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం పేరు రాశారు.

## ఉపాధి హామీ పనుల్లో.. నిజాంకాలం నాటి నాణేలు

మొదటి పేజీ తరువాయి

చూశారు. ఆ పాత్రలో పురాతన కాలం నాటి 25 వెండి నాణేలు, రెండు వెండి ఉంగరాలు లభ్యమయ్యాయి. పురాతన నాణెములు దొరికిన విషయాన్ని గ్రామస్తులు బహిర్గతం చేయగా చేర్యాల సీఐ శ్రీను, మద్దూరు తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో రామ్మోహన్ తదితర అధికారులు గ్రామానికి చేరుకొని, కూలీలకు దొరికిన నాణేలను పరిశీలించారు. ఇవి నిజాం కాలం నాటి నాణెములుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ నాణెములు, ఉంగరాలను పురావస్తు శాఖకు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు

మొదటి పేజీ తరువాయి

సుమారు 3 నుంచి 4 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా పార్కింగ్ స్థలం నుంచి గుట్టపైన వై జంక్షన్ వరకు నాలుగు ఉచిత బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం 28 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. దీక్షాపరుల మాలవిరమణ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కేశఖండనానికి కోనేరు పక్కన స్థలం కేటాయించారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో 650 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తారు. ఆరు మెడికల్ టీం లు, ఫైరింజన్ ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టనున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు తెలిపారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులపాటు గుట్టపైకి రోజుకు 10 లక్షల లీటర్ల చొప్పున నీటిని సప్లై చేస్తామని భగీరథ అధికారులు తెలిపారు.

కొండగట్టులో చిడతల రామాయణం

కొండగట్టులో చిడతల రామాయణాన్ని కళాకారులు ప్రదర్శించారు. వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం ఎంకతల గ్రామానికి చెందిన కళాకారుల బృందం బుధవారం అంజన్న సన్నిధికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో చిడతల రామాయణం ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనలో భాగంగా కళాకారుల నృత్యాలు, పాటలు కొండగట్టుకు వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉత్సవాలకు ప్రత్యేక అధికారులు

కొండగట్టు అంజన్న ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు ప్రత్యేక అధికారులుగా కృష్ణారావు, వినోద్ రెడ్డి లను నియమించినట్లు రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వీరు బుధవారం కొండగట్టుకు చేరుకొని అంజన్న ఆలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు.

## తెలంగాణ “కొత్త” గేయాన్ని ఆమోదించిన ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

జయ జయహే తెలంగాణ గీతాన్ని జాతికి అంకితం చేస్తామని చెప్పారు. ఉద్యమ కాలంలో అందరినీ ఉర్రూతలూగించిన తెలంగాణ ఖ్యాతిని చాటిన ఈ గీతాన్ని భవిష్యత్తులో తరతరాలు పాడుకునేలా, అందరి ఆమోదంతో రాష్ట్ర గీతంగా ఆమోదించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ ఇరవై ఏండ్ల కిందట రాసిన ఈ గీతాన్ని యథాతథంగా అమోదించినట్లు ప్రకటించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి సంగీతంతో పాటు స్వరాలు కూర్చారు. సచివాలయంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖతో పాటు మాజీ మంత్రి జానారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాంతో పాటు కవి అందెశ్రీ, సంగీత దర్శకులు కీరవాణి, సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ బిల్లును ఆమోదించినపుడు సభలో ఉన్న మాజీ ఎంపీలు, ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రెండు వర్షన్లలో తయారు చేశారు. 2.30 నిమిషాల నిడివితో ఒక వర్షన్, 13.30 నిమిషాల నిడివితో పూర్తి వర్షన్ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా పూర్తి గేయంలో ఉన్న మూడు చరణాలతో రెండున్నర నిమిషాల నిడివితో సంక్షిప్త గేయం ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కీరవాణి సంగీత సారథ్యంలోని యువ గాయనీ గాయకుల బృందం ఆలపించిన ఈ గీతం అందరినీ అలరించింది. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా తమ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగానే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్త రూపం టీఎస్ ను టీజీగా మార్చినట్లు సీఎం తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో పాటు అన్ని ప్రభుత్వ సంస్థలు టీజీగా మార్పు చేశామన్నారు. కేబినెట్ లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించటం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయం జరిగిందని సీఎం చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్లు సీఎం చెప్పారు. ఇంకా నమూనాలన్నీ చర్చల దశలోనే ఉన్నాయని, చిహ్నానికి సంబంధించిన తుది రూపమేదీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయమేదీ జరగలేదని, కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడించేలా, భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

## ఎన్‌హెచ్‌ఎంలో మూడు నెలలుగా జీతాలు లేవ్

మొదటి పేజీ తరువాయి

ఓ పోస్టు పెట్టారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ తదితర 78 విభాగాలలో పనిచేస్తున్న 17,541 మంది వైద్యులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు తదితరులు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాలను సంరక్షించేందుకు నిరంతరం కృషి చేసే వైద్య సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం ప్రజారోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు డొల్ల అని చెప్పడానికి ఇది మరో నిదర్శనం అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మూడు నెలల పెండింగ్ జీతంతో పాటు, పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విత్తనాల పంపిణీపై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షా

మొదటి పేజీ తరువాయి

చేశారు. జిల్లాలకు వచ్చిన విత్తనాల సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు ఆదేశించారు. సీడ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... జిల్లాల వారిగా నేటికి 68,16,967 వివిధ కంపెనీల ప్రత్తివిత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మిగతా ప్యాకెట్లు కూడా జూన్ 5వ తేదీలోగా జిల్లాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో రైతుల అవసరం మేరకు ప్రత్తి, జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. ఆ విత్తనాలను జిల్లా కలెక్టర్లు రైతులకు సక్రమంగా చేరేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఎక్కడైనా రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో వస్తే కౌంటరులు ఎక్కువ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకనుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు ప్రతినిత్యం పర్యటిస్తూ విత్తనాల విక్రయ కేంద్రాలు, జీలుగ, జనుము సరఫరా చేసే కేంద్రాల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో గతవారంలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు చేసుకొని సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విత్తన కంపెనీలు ప్రణాళిక ప్రకారం ప్రతి విత్తన ప్యాకెట్లను జూన్ 5లోగా జిల్లాలకు చేర్చాలని ఆదేశించారు. అదేవిధంగా కొన్ని జిల్లాల్లో ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో ఒక కంపెనీకి చెందిన ఒకే రకమైన విత్తనాలనే రైతులు కోరుతున్నారని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అలా కాకుండా యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం మార్కెట్లో లభ్యమవుతున్న అన్ని విత్తన హైబ్రిడ్ల దిగుబడి ఒక్కటేనని ఈ విషయాన్ని రైతులందరికీ సంబంధిత కంపెనీలు తెలియజేయాలని సూచించారు.

## రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నానికి చిక్కులు

మొదటి పేజీ తరువాయి

వర్గాల సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నంలో మార్పులు చేయాలంటే కేంద్ర హోంశాఖ నుంచి అనుమతి తప్పనిసరి అని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో సైతం లోగోను ఫైనల్ చేయడానికి దాదాపు ఏడాది పాటు కష్టపడాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే లోగోపై కేంద్ర హోంశాఖ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుందని, ఆ తర్వాతనే నిర్ణయాన్ని వెలువరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా చేయడానికి వీలుండదన్నారు. కేంద్ర హోంశాఖ నుంచి అనుమతి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం లోగోను రిలీజ్ చేసినా, ఫైనల్ చేసినట్లు అధికారికంగా ప్రకటన చేసినా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర గీతం, అధికారిక చిహ్నంపై సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరుగుతున్న సమావేశానికి కాంగ్రెస్ సహా సీపీఐ, సీపీఎం, మజ్లిస్, తెలంగాణ జనసమితి పార్టీలకు చెందిన ప్రతినిధులకు ఆహ్వానం వెళ్ళింది. రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పార్లమెంటు సభ్యులుగా ఉన్న పలువురిని కూడా ఆహ్వానించినట్లు సచివాలయ వర్గాలు తెలిపాయి. అందులో భాగంగానే విజయశాంతిని కూడా ఆహ్వానించారని, కానీ ఆమె ఒక సినిమా షూటింగ్‌లో భాగంగా వేరేచోట ఉన్నందున హాజరు కాలేనంటూ సమాచారం పంపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. సచివాలయంలో సమావేశం కంప్లీట్ అయిన తర్వాత అధికారిక చిహ్నం రిలీజ్‌పై ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే అవకాశమున్నది. కానీ సచివాలయ వర్గాలు మాత్రం జూన్ 2న రాష్ట్ర గీతం లాంచింగ్ మాత్రమే ఉంటుందని, లోగో విడుదల ఉండకపోవచ్చని సూచనప్రాయంగా తెలిపాయి.

## పెండింగ్‌లో డీఏల విడుదలకు ఉద్యోగుల నిరీక్షణ

మొదటి పేజీ తరువాయి

ముందే డీఏలు ప్రకటిస్తారని ఎంప్లాయిస్ ఆశగా ఎదురుచూశారు. కానీ ఎన్నికల హడావుడిలో ఉన్న ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు కోడ్ ముగిసిన వెంటనే పెండింగ్ డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

**పెండింగ్‌లో నాలుగు డీఏలు**

2022 నుంచి ఇప్పటివరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో కేంద్ర ప్రభుత్వం మరో డీఏను ప్రకటించేందుకు సిద్ధం అవుతున్నది. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఇవ్వకపోవడంతో ఎంప్లాయిస్ అసహనంగా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని పెదవి విరుస్తున్నారు. 2023 అగస్టులో (బీఆర్ఎస్ సర్కారు) ఒక డీఏ ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం కసరత్తు చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు కోపంగా ఉన్న ఎంప్లాయిస్‌ను మచ్చిక చేసుకునేందుకు పీఆర్ కమిషన్ ఏర్పాటు చేసి, 5 శాతం మధ్యంతర భృతిని ప్రకటించింది. కానీ ఎంప్లాయిస్ మాత్రం తమ పెండింగ్ డీఏలు ఇవ్వలేదని కోపంతో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారనే ప్రచారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ డీఏలు విడుదల జాప్యం జరగడం ఎంటని ఎంప్లాయిస్ ప్రశ్నిస్తున్నారు.

డీఏల విడుదల కోసం విజ్ఞప్తులు

పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో ఒక్క డీఏ కూడా ఇవ్వకపోవడంతో ఎంప్లాయిస్ ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కోడ్ ముగిసిన వెంటనే కనీసం రెండు డీఏలు అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సెక్రటేరియట్‌కు వచ్చి కనిపించిన మంత్రి, అధికారులకు విజ్ఞప్తులు అందిస్తున్నారు. డీఏల విడుదల కోసం ఎంప్లాయిస్ కళ్లలో ఒత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్నారని, ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అలర్ట్ చేసినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం పీఆర్సీ కమిటీ ఎంత పే స్కేల్ ఇవ్వాలనే దానిపై అధ్యయనం చేస్తున్నది. కానీ మెజార్టీ ఎంప్లాయిస్ కొత్త పీఆర్సీ అమలు కంటే, పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇస్తే చాలు అనే ధోరణిలో ఉన్నట్టు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి వివరించినట్టు తెలుస్తున్నది.

**త్వరలో ఉద్యోగ సంఘాలతో సీఎం భేటీ?**

ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి ఎంప్లాయిస్ అంశాలను చర్చించి, పరిష్కరించేందుకు రెడీగా ఉన్నట్టు తెలుస్తున్నది. పెండింగ్‌లో ఉన్న డీఏలు, హెల్త్ కార్డుల జారీ, బదిలీలు, ప్రమోషన్లపై అన్ని సంఘాల ప్రతినిధులతో చర్చించి తుది నిర్ణయం తీసుకునే చాన్స్ ఉన్నట్టు ఐఏఎస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అయితే ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఒకటి లేదా రెండు డీఏలు ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది.

## తెలంగాణలో కొత్తగా 27 రకాల బీర్లు

మొదటి పేజీ తరువాయి

తయారీ కంపెనీలకు ఈ ఏడాది రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతులు కూడా మంజూరు చేసింది. అయితే, వీటిలో అధికంగా క్రాఫ్ట్ బీర్లే ఉన్నట్లు సమాచారం. తెలంగాణ బేవరేజ్ కార్పొరేషన్ కొత్తగా అనుమతులు ఇచ్చిన కంపెనీల్లో టాయిట్ బ్రేవరీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్సోటికా లిక్కర్ ప్రైవేట్ లిమిటెడ్, మౌంట్ ఎవరెస్ట్ లిమిటెడ్, లీలాసన్స్ ఆల్కా బేవ్ ప్రైవేట్ లిమిటెడ్, సోం డిస్టిలరీస్ అండ్ బేవరేజెస్ ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న బీర్ల కొరతను తగ్గించేందుకు కొత్తగా బీర్ల కంపెనీలకు అనుమతులు ఇచ్చామని రాష్ట్ర ఎక్సైజ్శాఖ వెల్లడించింది.

## ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచడంపై సర్కార్ బడి బాట

మొదటి పేజీ తరువాయి

వరకు నిర్వహించాలని భావించింది. కానీ ఈ తేదీలను విద్యాశాఖ రీ షెడ్యూల్ చేసింది. బడి బాటలో భాగంగా స్కూల్ ఏజ్ పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్చేలా చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా చూడాల్సి ఉంటుంది. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా చేర్పించాలని పేర్కొంది. కాగా బడిబాటలో భాగంగా కలెక్టర్ల నుంచి మొదలు డీఈవో, ఎంఈఓ, హెడ్ మాస్టర్, టీచర్ వరకు ప్రతి ఒక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారు. ఇదిలా ఉండగా జూన్ 3 నుంచి జూన్ 11 వరకు బడి బాటలో భాగంగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు వీరు పాల్గొనాల్సి ఉంటుంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పున:ప్రారంభం కానున్న నేపథ్యంలో 11 వరకు కీలకంగా మారనుంది. జూన్ 3న బడి బాటలో భాగంగా గ్రామాల్లో పలు ఆర్గనైజేషన్లతో సమావేశాలు నిర్వహించి అడ్మిషన్లు పెరిగేలా చూడాల్సిన బాధ్యత సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, ఏఏపీసీ మెంబర్లు, హెచ్ఎం, టీచర్లు, పేరెంట్స్ పై ఉండనుంది. వచ్చే నెల 4న గ్రామాల్లో డోర్ టు డోర్ ప్రచారం చేపట్టి అడ్మిషన్లు జరిగేలా చేపట్టాల్సి ఉంటుంది. వచ్చేనెల 5 నుంచి 10 వరకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేపట్టి అంగన్‌వాడీ తో పాటు ప్రభుత్వ స్కూళ్లలో అన్ని క్లాసుల వారీగా అడ్మిషన్లు పొందేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. జూన్ 11న గ్రామ సభ నిర్వహించి పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చడం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.


తీన్మార్
తెలుగు దినపత్రిక

# సిద్ధమంటున్న ఇండియా కూటమి


దేశంలో లోక్ సభ ఎన్నికల తుది దశ పోలింగ్ తరువాత ఇండియా కూటమి నేతలు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి దాదాపు అన్ని రాష్ట్రాల ముఖ్యనేతలు హాజరుకానున్నారు. దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే 6 దశల్లో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. అయితే జూన్ 1న పలు రాష్ట్రాల్లో మొత్తం 57 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో లోక్ సభ ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుంది. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్నాయి. ఇండియా కూటమికి సంబంధించిన ముఖ్యనేతలు ఢిల్లీలో సమావేశం కానున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా దేశంలోని 28 విపక్ష పార్టీలతో కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్లూషన్ అలియన్స్ పేరుతో కూటమిగా ఏర్పడింది. ఈ కూటమి జూన్ 1న ఇటు తుదిదశ పోలింగ్ జరుగుతుండగా అదే రోజు శనివారం మధ్యాహ్నం లేదా సాయంత్రం ఈ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నేతృత్వంలో సోనియా, రాహుల్ గాంధీల సమక్షంలో ఈ సమావేశం జరగనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, సామాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ తో పాటు ఇతర ముఖ్య నేతలకు ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది. అలాగే ఇండియా కూటమిలోని అన్ని భాగస్వామ్య పార్టీలకు ఆహ్వానం పంపడం, పైగా ఫలితాలకు నాలుగు రోజుల ముందు ఈ సమావేశం ఏర్పాటు చేయడంపై దేశ వ్యాప్తంగా జోరుగా చర్చ జరుగుతోంది. జూన్ 1న ఈ సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ గడువు జూన్ 2న ముగియనుంది. కేవలం ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్ కు 20రోజులకు పైగా మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ గడువు జూన్ 2తో ముగియడంతో తిరిగి తీహార్ జైలుకు వేళ్లే ఒక రోజు ముందు ఇండియా కూటమి మీటింగ్ జరగనుంది. సీఎం కేజ్రీవాల్ జైలుకు వెళ్లడాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా జూన్ 1న ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే కేజ్రీవాల్ మే 27న తన మధ్యంతర బెయిల్ పిటిషన్?పై సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. అనారోగ్య కారణాల వల్ల మనీలాండరింగ్ కేసులో.. మధ్యంతర బెయిల్ పొడిగించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేయనున్నారు. గతంలో ఇచ్చిన బెయిల్?ను మరో 7 రోజులపాటు పొడిగించాలని పిటిషన్ లో పేర్కొన్నారు. సీఎం కేజ్రీవాల్ పిటిషన్ ను స్వీకరించిన అత్యున్నత ధర్మాసనం ఈరోజు విచారించనుంది. ఒక వేళ గడువు పొడిగిస్తే ఎన్నికల ఫలితాలు వచ్చే సమయంలో సీఎం కేజ్రీవాల్ జ్యూడీషియల్ కస్టీడీలో కాకుండా బయట ఉండే అవకాశం ఉంది. ఈ సమావేశంలో విపక్ష కూటమి తీసుకోవల్సిన చర్యలు, లోక్ సభ ఎన్నికల్లో ఆయా పార్టీలు కనబర్చిన పనితీరుపై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఒకవేళ తమకు ఫలితాలు అనుకూలంగా వస్తే ఎలా ముందుకు సాగాలన్న దానిపై కూడా ఈ మీటింగ్ లో చర్చించనున్నారు. ఈ సమావేశం జరిగేందుకు సిద్దమైన తరుణంలోనే కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే కూటమిని ప్రతిపక్షాల ఇండియా కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన భావనను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 'నరేంద్ర మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లో సైతం కాంగ్రెస్ కూటమికి పది పార్లమెంటు స్థానాలు అలవోకగా వచ్చే అవకాశం ఉంది. మధ్యప్రదేశ్ చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లో బీజేపీ బలంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ కూటమికి సైతం గతంలో కంటే ఎక్కువగా సీట్లు వచ్చే అవకాశం ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ ప్రభావం మసకబారితే ఆ పార్టీ అధికారానికి రావడం కష్టతరమని చెప్పవచ్చు. ఇక దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ కర్ణాటక రాష్ట్రాల్లో బీజేపీకి 30 పార్లమెంట్ స్థానాలకు మించి వచ్చే అవకాశాలు లేవన్నది ఆ పార్టీ అగ్ర నాయకులకు తెలియంది కాదు. ఉత్తరాదిలో జరగబోయే నష్టాన్ని దక్షిణాదిలో పుచ్చుకోవాలని బీజేపీ అగ్రనాయకత్వం గత మూడేళ్లుగా వ్యూహాత్మకంగా టార్గెట్ దక్షిణాది అంటూ చెమటోడ్చి పనిచేస్తున్నప్పటికీ, వారి ఆశలకు ప్రజా తీర్పుకు పొంతన ఉండే అవకాశాలు లేవు. పదేళ్ల నరేంద్ర మోడీ పాలనలో ఇచ్చిన హామీలకు ప్రజల ఆశలకు పొంతన లేదని చెప్పవచ్చు. ఉపాధి కల్పన, దారిద్ర నిర్మూలన, అభివృద్ధి, సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామిక నిర్ణయాలు, అవినీతి నిర్మూలన పట్ల ప్రజలు సంతృప్తిగా లేరు. పదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో మోడీ విఫలమైనట్లు ముఖ్యంగా ఉత్తరాది ప్రజలు భావిస్తున్నారు. నల్లధనం ఏరివేత పేరుతో చేసిన పెద్దనోట్ల రద్దు కొండను తవ్వి ఎలుకను కూడా పట్టని చందంగా తయారైంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అటు ఉంచితే ఈ పదేళ్ల సుదీర్ఘ కాలంలో రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించలేని స్థితిలో మోడీ ప్రభుత్వం పనిచేసినట్లు ప్రజలు భావిస్తున్నారు. నరేంద్ర మోడీ కంటే ముందు పద్నాలుగు మంది ప్రధాన మంత్రులు చేసిన అప్పులకు మూడింతల అప్పు నరేంద్ర మోడీ హయాంలో పెరిగిందంటే అతిశయోక్తి కాదు. దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటినీ అమ్మేయడం, మత ఘర్షణలను రెచ్చగొట్టడం, పేదరికాన్ని మరింత పెంచడం, సంపన్నుల ఆదాయం అమాంతం పెరిగిపోతుండటం, పేదలు పేదలుగానే మిగిలిపోతుండడం పట్ల ఓటర్లలో ఆ పార్టీ పట్ల అసహనం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, 80 కోట్ల భారతీయులకు 5 కిలోల చొప్పున సబ్సిడీ బియ్యాన్ని అందిస్తామని ప్రఆరు విడుతల పోలింగ్ పూర్తి అయింది. 486 స్థానాలకు పోలింగ్ ముగిసింది. పదవి నుంచి దిగిపోయే ప్రధాని రిటైర్‌మెంట్ ప్రణాళికలు రచించుకుంటున్నారు అంటూ స్పందించారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ పూర్తిగా పతనం అయిందన్నారు. దక్షిణ భారతదేశంలోనే కాకుండా.. ఉత్తర, పశ్చిమ, తూర్పు భారతంలో కూడా బీజేపీ బలం సంగానికి పడిపోయిందని వ్యాఖ్యానించారు జైరాం రమేష్.

# కోట్లు మింగేసిన బందిపోటు కేటుగాళ్లు...

- అడ్డాకుల గ్రామ పంచాయతీ కోట్లలో అవినీతి
- ఒకే ఎంబి నెంబర్ పై రెండు బిల్లులు
- కిలో బెల్లం 1350 రూపాయలు
- లీటర్ పెట్రోల్ ధర 125 రూపాయల
- అసలు ఎన్ని కోట్లు దోచుకొని దాచుకున్నారు..?
- ప్రజా సంపదను అందరూ కుమ్మక్కై అందిన కాడికి పీక్కు తింటున్నారా..?
- గ్రామపంచాయతీ నిధుల్లో గోల్ మాల్
- అధికారులు ప్రజాప్రతినిధులు కుమ్మకయ్యారా?
- వెలుగులోకి విస్తుపోయే నిజాలు మరెన్నో
- అక్రమాలలో వాటాల పర్వం? ఉలుకు పలుకులేని జిల్లా అధికారులు
- నిధుల మళ్లింపు వ్యవహారం జిల్లా అధికారులకు తెలిసే జరిగిందా..?
- అందరూ కలిసి జతకట్టి కాజే చేసారా? మండల ప్రజల ఆరోపణలు
- జిల్లా అదికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి




దేవరకద్ర ప్రతినిధి, మే 30(తీన్మార్ న్యూస్): పంచాయతీల పాలన గాడి తప్పుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయి. గత ప్రభుత్వ బిఆర్ఎస్ పరిపాలనలో అక్రమార్కులకు అధికారంలో ఉన్న కొంతమంది ప్రజాప్రతినిధుల నుంచి అండదండలు లభిస్తుండటంతో పంచాయతీలకు మంజూరైన నిధులను యథేచ్ఛగా దోపిడీ చేశారని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలే ప్రగతికి పట్టుగొమ్మలన్న ఆలోచనతో టీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే నూతన పంచాయతీరాజ్ చట్టం- 2018ను అమల్లోకి తెచ్చింది. అందుకనుగుణంగా జీపీలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుండగా, అడ్డకుల గ్రామపంచాయతీలో చేతివాటం ప్రదర్శిచారు. ప్రతి నెలా లక్షల రూపాయలు స్వాహా చేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అనే సామెత వినే ఉంటారు. ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజాదానాన్ని జీతాలుగా తీసుకుంటూ ప్రజా సంపదను కాపాడకుండా అందిన




కాడికి అందరు కుమ్మక్కై ప్రజలను పీడించి రక్తదాన పిశాచుల ఇంకెన్నాళ్లు పీకు తింటారు. మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో గ్రామపంచాయతీ నిధుల గోల్ మాల్ ప్రజాసేవ ముసుగులో బందిపోటు దొంగలు ఉన్నారని మండల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. అడ్డాకుల గ్రామపంచాయతీలో రెండు కోట్ల అవినీతి జరిగిందని కొందరు, మూడు కోట్ల అవినీతి జరిగిందని మరికొందరు వాట్సాప్ గ్రూపులలో సమాచారాన్ని పెట్టడంతో గ్రామంలో మండలం ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పార్లమెంట్ ఎన్నికలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ బిజీగా ఉండడంతో గ్రామంలోని సాధారణ పౌరులు ప్రతినిత్యం ఈ విషయాల గురించి మాట్లాడుకున్నారని ప్రజలు కోరుతున్నారు. 2019-20 సంవత్సరంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు 1 కోటి 56 లక్షల 18 వేల 823 రూపాయలు, అయితే దీనికి ఖర్చు చేసిన మొత్తం లెక్కలలో చూపలేదని,



2020-21 సంవత్సరంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు 1 కోటి 61 లక్షల 70 వేల 756 రూపాయలు, దీనికి ఖర్చు చేసిన మొత్తం 1 కోటి 60 లక్షల 27 వేల 241 రూపాయలు, 2021- 22 సంవత్సరంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు 1 కోటి 57 లక్షల 1 వెయ్యి 061 రూపాయలు, దీనికి ఖర్చు చేసిన మొత్తం 1 కోటి 60 లక్షల 27 వేల 241 రూపాయలు, 2022 - 23 సంవత్సరంలో గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు 1 కోటీ 22 లక్షల 15 వేల 219 రూపాయలు, దీనికి ఖర్చు చేసిన మొత్తం 1 కోటి 6 లక్షల 25 వేల 584 రూపాయలు చూపించారు. 4 సంవత్సరాలలో గ్రామపంచాయతీకి వచ్చిన మొత్తం నిధులు 5 కోట్ల 97 లక్షల 05 వేల 859 రూపాయలు కాగా దీనికి ఖర్చు చేసిన మొత్తం 2 కోట్ల 90 లక్షల 80 వేల 114 రూపాయలు చూపించారు. 3 కోట్ల 6 లక్షల 25 వేల 745 రూపాయలకు లెక్కలు లేవని సమాచార హక్కు ప్రచార వేదిక కన్వీనర్ కోయిని వెంకన్న గత సంవత్సరం వాట్సాప్ గ్రూపులలో పెట్టి హల్ చల్ చేశారు. సమాచారం తప్పని నిరూపిస్తే జైలుకు వెళ్లడానికి సిద్ధమని సవాల్ చేశారని ఆరోపణలు, గత నెల రోజుల క్రితం అడ్డాకుల గ్రామానికి చెందిన వారు సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీకి చెందిన పూర్తి సమాచారాన్ని తీసుకుని రెండు కోట్ల పైన అవినీతి జరిగిందని సమాచారాన్ని వాట్సప్ గ్రూపులలో పెట్టారు. ఇప్పటికీ అడ్డాకుల గ్రామ పంచాయతీలో ఎన్ని కోట్ల రూపాయల అవినీతి జరిగిందో అధికారులు ఎంక్వయిరీ చేస్తే తప్ప అసలు విషయాలు బయటికి వస్తాయని, దీనిపై అదికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బడిబాట కార్యక్రమం ప్రారంభం

## - ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలి



భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 30(తీన్మార్ న్యూస్): బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే అధికారులను కోరారు. గురువారం నాడు కలెక్టరేటు కాన్ఫరెన్స్ హాలులో బడిబాట కార్యక్రమంపై వివిధ శాఖల సమన్వయ కమిటీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వచ్చే జూన్ 3 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైట్ టూ ఎడ్యుకేషన్ విద్యా హక్కు చట్టంలో భాగంగా 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లాలని, అందుకోసం గ్రామాలలో, హ్యాబిటేషన్లలో పిల్లలను గుర్తించాలని, దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ బడులలో కల్పిస్తున్న వసతులను, పథకాలను, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు, కమ్యూనిటీ పెద్దలకు వివరించాలని, అంగన్వాడీలలో బడికి వెళ్లే పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, బడిపిల్లల తక్కువ నమోదు ఉన్న పాఠశాలలను గుర్తించి తల్లిదండ్రులు, కమ్యూనిటీ పెద్దల సహకారంతో ప్రభుత్వ బడులలో చేర్పించాలని, మధ్యలో బడి మానేసిన పిల్లలను గమనించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో కలిసి అర్హత కలిగిన తరగతులలో వారిని తిరిగి చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందచేసే డ్రెస్సులు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, డిజిటలైజేషన్ తరగతులపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే జూన్ 3 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు జరిగే బడిబాట కార్యక్రమం కోసం మండల స్థాయి కమిటీలు ఈనెల 31 న సమావేశమై క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అశా, అంగన్వాడీ, స్వయం సహాయక మహిళా సమాఖ్యల సమన్వయంతో ఇంటింటి ప్రచారంతో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని తెలిపారు. బడి బాట కార్యక్రమంలో జూన్ 3 నుండి 11 వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు ప్రతి రోజూ క్షేత్రస్థాయిలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, 3 వతేదీన గ్రామ స్థాయి డ్రైవ్ చేపట్టి స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో ప్రమాణాలు, ర్యాలీలు నిర్వహించాలని, 4 వ తేదీన ప్రతి ఇంటికి వెళ్లి పాఠశాలకు వెళ్లే విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల వివరాలను విలేజి ఎడ్యుకేషన్ రిజిష్టర్లో నమోదు చేయాలని, 5 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే వసతుల పట్ల అవగాహన కలిగించి నమోదు చేయించాలని, 11 న గ్రామ సభల ఏర్పాటు చేయాలని అన్నారు. 12 న విద్యార్థులకు స్వాగత దినోత్సం ఏర్పాటు చేసి పాఠశాలలను అందంగా పండుగ వాతావరణంలో అలంకరించాలని, రంగోలి తదితర ఉత్సాహ కార్యక్రమాలు రూపొందించాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన వసతులను వివరించాలని, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, కమ్యూనిటీ వారితో పేరెంట్ టీచర్ మీటింగ్లు ఏర్పాటు చేయాలని, చేపట్టిన పనులను ప్రారంభించాలని, టెక్స్ట్ బుక్స్, డ్రెస్సులను విద్యార్థులకు అందచేయాలని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో మంచి ప్రతిభ కనబరచిన, మంచి హాజరు కలిగిన విద్యార్థులను మెచ్చుకోవడంతోపాటు అందుకు ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులను సన్మానించాలని తెలిపారు. 13 న తరగతి వారిగా విద్యార్థులు తయారు చేసిన విద్యా ప్రమాణాలకు సంబంధించి పోస్టర్లను, చార్ట్ లను ప్రదర్శించి తరగతి గదులను డెకరేట్ చేయాలని తెలిపారు. 14 న సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, కమ్యూనిటీ పెద్దలను భాగస్వామ్యం చేయాలని, పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఉన్నత పాఠశాలలకు సంబంధించి విద్య యొక్క ప్రాముఖ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్దినీ విద్యార్థులతో ప్రదర్శించాలని, 15 తేదీన సహిత విద్య, బాలికల విద్యా దినోత్సవం జరుపుకోవాలని, బడి బాట కార్యక్రమంలో గుర్తించిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను భవిత కేంద్రాలలో, పాఠశాలల్లో చేర్పించాలని, ఈ కేటగిరిలో వారిని వంద శాతం నమోదు చేయాలని తెలిపారు. గ్రామాలలో, ఆవాసాలలో ఎటువంటి బాల కార్మికులు లేకుండా చూడాలని, గుర్తించిన వారందరిని పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 18 వ తేదీన డిజిటల్ తరగతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తరగతి వారిగా విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, మొక్కలు పెంచే బాధ్యతను వారికే అప్పగించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిన విషయాన్ని ఇంటింటా చదువుల పంట అనే యాప్ గురించి తలిదండ్రులకు తెలియచెప్పాలని అన్నారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో పాఠ్య పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయడం జరుగుతున్నదని, ఉపాధ్యాయులకు ఇంగ్లీషు బోధనలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియచెప్పాలని అన్నారు. 19 న క్రీడా దినం ఏర్పాటు చేసి విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, పుట్బాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించాలని, బడిబాట కార్యక్రమాల లక్ష్యం ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచడమేనని, వారికి నాణ్యమైన విద్య అందించడమేనని, అందుకోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, భువనగిరి ఆర్.డి.ఓ. అమరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా విద్యాశాఖ అధికారి కే.నారాయణరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి

**– జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర శేఖర్**



వనపర్తి ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూస్): రైతులు వ్యవసాయ విత్తనాలు కోసం, కొనుగోలు చేసే విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు కట్టిన వెంటనే రసీదు కూడా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ అన్నారు. వెలటూర్ గ్రామంలో ఉపాధి హామీ, మరియు రైతుల దగ్గరికి వెళ్లి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ముఖ్యంగా రైతులు లూజుగా వున్నా, పైన సీల్ లేకుండా వున్నా సంచులలో విత్తనాలను ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయరాదని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుండి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్ మరియు బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన ఆధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రైతులను ఉద్దేశించి తగు జాగ్రత్తలు చెప్పారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల ని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. విత్తనాలు మరియు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫర్టిలైజర్ షాప్ దుకాణదారులు పాటించవలసిన నియమ నిబంధనలు వివరించారు. రైతుల విషయము లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు మరియు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, ఆ రసీదును భద్రంగా దాచి పెట్టుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రభుత్వా అనుమతి ఉన్న దుకాణంలోని విత్తనాలను, ఎరువులను కొనుగోలు చేయాలని, తమ కంపెనీ నెంబర్ ను, బిల్లులపై దుకాణం ముద్ర ఉండేలా చూడాలని అన్నారు. విత్తనాల ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమా శాతం చూసుకోవాలని, విత్తనాల సంచులపై ప్రమాణికలు ఉన్నాయో వివరాలు కచ్చితంగా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రైతుల ను ఉద్దేశించి పలు జాగ్రత్తలు సూచనలు చేశారు. నాకు లీవ్ విత్తనాలు క్రైస్తవ నమోదు చేస్తామని, వ్యవసాయ శాఖ మరియు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు జరిగింది అని, జిల్లా వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తుంటారని షాపు యజమానులు కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. వెలటూర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఫర్టిలైజర్ ఎరువుల విత్తనాలు అమ్మే దుకాణ యజమానులు పాటించాల్సిన నిబంధనలు, ఎరువుల దుకాణం ఎదుట ధరల వివరాలను బోర్డుపై ఖచ్చితంగా నమోదు చేయాలని వెలటూర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. అక్కడ లభించే విత్తనాలు, రకాలు, డీలర్ల వివరాలను తప్పకుండా బోర్డు పై పేర్కొనలని, స్టాక్ రిజిస్టర్లు, విత్తన, ఎరువుల వివరాలు బుక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడువివరాలు పొందుపరచాలని వెలటూర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. నిబంధనలు పాటించని ఫర్టిలైజర్ షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్ షాప్ యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్, వెలటూర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, ఉపాధి హామీ కూలీలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకి నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలి

**– స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్**

**– హనుమంతు కే. జండగే**



భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 30(తీన్మార్ న్యూస్): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు సీడ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే తెలిపారు..గురువారం నాడు ఆయన వ్యవసాయ, పోలీస్ అధికారులతో సమావేశమైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం 2024 సీజన్ పురస్కరించుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా విత్తన చట్టాన్ని పకడ్బందిగా అమలు చేసేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో 4 విత్తన స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యమైన విత్తన సరఫరా కోసం స్క్వాడ్ బృందాలు డీలర్ షాపులలో తనిఖీలు నిర్వహించడం, స్టాక్ రసీదులు పరిశీలించడం జరుగుతుందని, అక్రమ చర్యలకు పాల్పడితే విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పి.డి. యాక్ట్



ప్రయోగించాలని తెలిపారు. విత్తన, ఎరువుల గోదాములను, డీలర్ షాపులను తనిఖీ చేయాలి, సీడ్ లైసెన్స్ పరిశీలించాలి, నేమ్ బోర్డ్, స్టాక్ బోర్డ్, ధర జాబితా, బిల్లులు, డెలివరీ చలాన్‌లు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించాలని, బుక్ బ్యాలెన్స్‌తో స్టాక్ పరిశీలించాలన్నారు. తనిఖీ సమయంలో గడువు ముగిసిన విత్తన స్టాక్ ఏమైనా ఉందా అని పరిశీలించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయించడం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలను నియంత్రించాలని, అలాగే రైతుల నుండి ఏదైనా ఫిర్యాదులు అందితే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు నకిలీ విత్తనాల పట్ల కలిగే నష్టాలపై, మేలు రకం విత్తనాల ద్వారా వచ్చే లాభాలను వివరించాలని సూచించారు. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు బ్రాండెడ్ విత్తనాలను కొనాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకొని దగ్గర ఉంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు రెవిన్యూ కలెక్టర్ పి.బెన్ షాలోమ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు దేవీసింగ్, పద్మావతి, వెంకటేశ్వర్లు, నీలిమ, వ్యవసాయ, పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**– ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివకృష్ణ**



ఇబ్రహీంపట్నం, మే 30(తీన్మార్ న్యూస్): అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా శివ కృష్ణ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను అమ్ముతూ, విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తూ వివిధ రకాల పేర్లతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. 1994 సంవత్సరంలో ప్రభుత్వం తీసుక వచ్చిన జీవో నెంబర్ 1 ప్రకారం ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యాసంస్థలు పనిచేయాలని చెప్తున్న వాటిని ఏ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పాటించకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ధనార్జనే ధ్యేయంగా డొనేషన్లు, స్పెషల్ ఫీజులు, బస్సుఫీజు, యూనిఫామ్ ఫీజు, బుక్స్ ఫీజ్ అని వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మానసికంగానూ వేధిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా 2009 లో వచ్చిన జీవో నెంబర్ 91 ప్రకారం కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈ టెక్నో, డిజి, టాలెంట్, ఒలింపియాడ్ అనే బ్రాండ్ పేరుతో పాఠశాల నడప వద్దని పాఠ్యపుస్తకాలను అమ్మొవద్దని ఉన్న వాటిని కూడా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల పట్టించుకోవడంలేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మొద్దునిద్ర వీడి, స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేసి వారి పైన శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# తెలంగాణ అవిర్భావ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

**– అధికారులకి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే**



భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 30(తీన్మార్ న్యూస్): జూన్ 2 వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జండగే అధికారులకు సూచించారు. గురువారం నాడు కాన్ఫరెన్స్ హాలులో ఆయన అన్ని శాఖల అధికారులతో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఏర్పాట్లను సమీక్షిస్తూ జూన్ 2 వ తేదీన ఉదయం 9.00 గంటలకు సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతకవిష్కరణ జరుగుతుందని, అంతకు ముందు భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



రాజాపేట, మే 30(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, చల్లూరు గ్రామంలో గురువారం పలు కుటుంబాలను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. గ్రామానికి చెందిన బైకని బిరప్ప అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబాన్నీ, అదే గ్రామానికి చెందిన గుంటి బాలమ్మ గుండెపోటుతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, ఓబిసి సెల్ రాజపేట మండల అధ్యక్షులు బొంత సుధాకర్, యువజన విభాగం మండల శాఖ అధ్యక్షులు ఇంజ నరేష్, రాజపేట కాంగ్రెస్ నాయకులు నమిల కేదారి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భీమగాని బాల్ నరసయ్య, మునిగడప కనకయ్య, దిడ్డిగా రమేష్, మాజీ సర్పంచ్ బడే ఎల్లయ్య, శాగ నవీన్, మాజీ ఎంపీటీసీ బడే ఇందిరమ్మ, గడమల యాదేందర్, చెట్కూరి గౌరయ్య, గుంటి శ్రీరాములు, మీస బాల మల్లయ్య, బైకనీ సిద్దులు సితారపు మహేందర్, గ్యార రాములు, మీస కరుణాకర్, బైకని సత్తయ్య సార్ల రాములు, పోతరాజు మల్లేష్, గుంటి నవీన్, కుటుంబ సభ్యులు బైకనీ కనకయ్య, బైకని యాదగిరి, బైకని రాజు, గుంటి శ్రీశైలం, గుంటి వెంకటేష్,పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాల షాపుల ఆకస్మిక తనిఖీ

**– తనిఖీ చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం**



రాజాపేట, మే 30(తీన్మార్ న్యూస్): రాజపేట మండల కేంద్రంలోని పలు విత్తనాల షాపులను గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా టాస్క్ ఫోర్సు బృందం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు దేవ్ సింగ్, పోచంపల్లి ఏవో ఇజాజ్ అలీఖాన్, వలిగొండ ఏవో అంజని, రాజపేట ఏవో మాధవి, ఎస్సైనర్సింహారెడ్డి, కానిస్టేబుల్ నవిన్ బృందం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బిల్ బుక్కులు, లేబుల్ లేని విత్తనాలు అమ్మకం నిలిపివేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పిడి యాక్టివ్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకొనున్నట్లు దేవ్ సింగ్ హెచ్చరించారు. విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు.

# సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**– కార్మిక వ్యతిరేక బీజేపీ ని కట్టడి చెయ్యాలి**

**– సిఐటియు జిల్లా నాయకులు ఎస్కే.యాకూబ్**



గరిడేపల్లి, మే 30(తీన్మార్ న్యూస్): కార్మిక వ్యతిరేక బీజేపీ ని కట్టడి చెయ్యాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని సీఐటీయూ జిల్లా నాయకులు యస్కె.యాకుబ్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రం లో సిఐటియు 54 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న 1970లో సిఐటియు పుట్టి నేటికీ 54 సంవత్సరాల అయిందని నాటినుండి నేటి వరకు కార్మికుల పక్షాన ప్రజా సమస్యల ఏజెండాగా తీసుకొని పనిచేస్తుందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు రైతులకే కాదు అన్ని వర్గాల ప్రజలకు మొత్తం దేశానికి ద్రోహం చేస్తుందని అన్నారు. ఈ దేశంలోని శ్రామిక ప్రజలందరూ ఒకటావ్వాల్సిన అవసరం ఉంది అని అన్నారు. ఒకటే నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా నిజమైన సాధికారత కోసం ఐక్య పోరాటాలు కొనసాగించటానికి ఇది అనువైన సమయం అని అన్నారు. విభజన శక్తులను ఎదురిస్తూ శ్రామిక వర్గ ఐక్యతను కాపాడటంలో సిఐటియు ముందంజలో ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పరిశ్రమలను లూటి చేస్తుందని అన్నారు. కార్మికుల సొమ్ముని బడా పెట్టుబడిదారులకు తోచిపెడుతుందని అన్నారు. అందుకే మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వర్గం బిజెపికి వ్యతిరేకంగా పనిచేసిందని అన్నారు. రాబోవు రోజుల్లో పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కందుల వెంకన్న, జూలకంటి బిక్షం రెడ్డి, సాయి, నరసయ్య,వెంకన్న, రాములు, సతీష్, కిషోర్, విద్య నాయక్, రవి,శీను, లింగారెడ్డి, పాల్గొన్నారు.

# కనికరం లేని కొడుకులకు,కోడళ్ళకు కౌన్సిలింగ్

జగిత్యాల: కన్న తల్లి,దండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులు ,కోడళ్లకుతెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కౌన్సిలింగ్ చేయడంతో తాము తమ తల్లిదండ్రులను పోషిస్తూ, బాగోగులు చేసుకోవడానికి సమ్మతించి ఒప్పంద పత్రం రాసిచ్చారు. ఆ తల్లిదండ్రుల అభ్యర్థన పై పిలిపించి వయోవృద్ధుల చట్టం పై అవగాహన కల్పించి, తల్లిదండ్రులను పోషించక నిరాదరణకు గురిచేస్తే ట్రిబ్యునల్ అధికారి ఆర్డీవో 3 మాసాలకు పైగా జైలు శిక్ష,జరిమానా విధించే వీలు ఆ చట్టంలో ఉందని,మాయ మాటలతో,బెదిరింపులతో వారి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్నా అట్టి ఆస్తులు తిరిగి ఆ తల్లిదండ్రుల పేరిట మార్పిడి చేసే అధికారం జిల్లా కలెక్టర్ కు ఉందని కౌన్సిలింగ్ చేశారు.జిల్లా కేంద్రానికి చెందిన తక్లూరి కమలమ్మ ను ఆమె పెద్ద కుమారుడు ,పెద్ద కోడలు,చిన్న కొడుకు,చి న్న కోడలు పోషించక వేధింపులకి గురి చేస్తున్నారని , సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ కు ఫిర్యాదు చేయడంతో అసోసియేషన్ గౌరవ సలహాదారు మాజీ మున్సిపల్ చైర్మన్ జీ.ఆర్.దేశాయ్,ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, వి.ప్రకాశ్ రావు,పట్టణ ఆధ్యక్షుడు సీనియర్ న్యాయ వాది పి.సతీశ్ రాజ్ ,ఎం.డి.యాకూబ్ తదితరులు ఆ కనికరం లేని కొడుకులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇవ్వడం తో వారు ఆ తల్లిదండ్రులను పోషిస్తామని,లేకుంటే తమపై చట్ట ప్రకారము ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో కు కేసు దాఖలు చర్యలు తీసుకోవాలని ఒప్పంద పత్రం రాసిచ్చారని జిల్లా తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అస్సోసియేషన్ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు.

# కడుకుంట్ల గ్రామానికి త్రాగునీటి సమస్య తీర్చిన వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి



వనపర్తి ప్రతినిధి, మే 28(తీన్మార్ న్యూన్): వనపర్తి మండలం, కడుకుంట్ల గ్రామ బీసీ కాలనీలో ఎంతో కాలంగా గ్రామ ప్రజలు నేటి సమస్యతో ఎదుర్కొంటున్నారు. మండల అధ్యక్షులు రవి కిరణ్ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందిస్తూ గ్రామంలో రెండు బోర్లు వేయించారు. మొదటి బోరు హైస్కూల్ వెనకాల, రెండవ బోరు పోచమ్మ గుడి వెనకాల వేయించారు. మొదటి బోరులో రెండున్నర ఇంచులు నీరు రాగ, రెండవ బోరులో మూడు ఈంచుల నీరు వచ్చాయి. గ్రామంలో నీటి సమస్య తీరడంతో ఎమ్మెల్యే మేఘా రెడ్డి గ్రామ కాంగ్రెస్ కమిటీకి గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నక్క రవి కిరణ్, టీపీసీసీ కాంగ్రెస్ పార్టీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

# యదేచ్ఛగా మట్టి అక్రమ రవాణా





రాజాపేట, మే 30(తీన్మార్ న్యూస్): రాజపేట మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా ఆగడం లేదు. మట్టి అక్రమ తవ్వకాలు జరగడం, ప్రతిరోజు వేలాది రూపాయల విలువైన మట్టి అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు తమకు ఫిర్యాదు అందలేదంటూ తమ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గత కొద్ది రోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరించడం పట్ల పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. కొందరు మట్టి వ్యాపారులు అధికారులను ప్రసన్నం చేసుకొని తమకు ఎదురేలేదన్న ధోరణితో తమ అక్రమ వ్యాపారాన్ని కోన సాగిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై పత్రికల్లో కథనాలు వెలువడుతున్న ఏ స్థాయిలో పట్టించుకునే నాధుడే కరువయ్యారు. మొత్తంగా అధికారులు రాజకీయ నాయకుల అండదండల నేపథ్యంలో అక్రమ మట్టి వ్యాపారం భారీ స్థాయిలో కొనసాగుతుంది.

# మారనున్న హైదరాబాద్ .. మెగా హైదరాబాద్

హైదరాబాద్, : భాగ్యనగరానికి మణిహారమైన ఔటర్ రింగ్ రోడ్డు వరకూ జీహెచ్ఎంసీని విస్తరించేందుకు రేవంత్ సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను అన్నీ కలిపి మెగా గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై తుది నివేదికలు సైతం సిద్ధం అయినట్లు సమాచారం. లోక్ సభ ఎన్నికల ఫలితాల అనంతరం మెగా గ్రేటర్ ప్లాన్ ఓ కొలిక్కి రావచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ మహానగరం ఇప్పటికే ఎంత అభివృద్ధి చెందిందో తెలియనిది కాదు.రాష్ట్ర నలుమూలల నుంచి.. ఉపాధి కోసం ఎంతో మంది ప్రజలు ఇక్కడకు వస్తూ ఉంటారు. ఎంతో మందికి హైదరాబాద్ మహా నగరం.. ఆశ్రయం ఇస్తూనే ఉంది. ఈ క్రమంలో.. ఇకపై గ్రేటర్ హైదరాబాద్ నగరం.. మెగా గ్రేటర్ హైదరాబాద్ గా విస్తరించ నుంది. ఆ దిశగా కాంగ్రెస్ సర్కార్ సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళ్లనుంది.ఇప్పటికే జీహెచ్ఎంసీ మాస్టర్ ప్లాన్, హెచ్ఎండీఏ మరో మాస్టర్ ప్లాన్, సైబరాబాద్ డెవలప్ మెంట్ అథారిటీ , హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ డెవలప్ మెంట్ అథారిటీ వంటి ప్రణాళికలు ఇప్పటిదాకా అమలవుతున్నాయి. ఇప్పుడు వీటన్నింటి స్థానంలో సమగ్ర ప్రణాళిక తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తోంది. ఒకసారి మాస్టర్ ప్లాన్ కనుక ఫైనల్ అయితే అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుంది. దీనితో పర్యాటక రంగానికి, రియాలిటీ రంగానికి అది ఆదాయ వనరుగా మారుతుంది. రాబోయే 30-40 సంవత్సరాల అవసరాలు తీర్చడంతో పాటు దేశ, విదేశీ నగరాలను మించి మహానగరాలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే దీనికోసం అన్ని విభాగాలను సమాయత్తం చేసింది. 2050 మాస్టర్ ప్లాన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇండస్ట్రీ వర్గాలు హర్షిస్తున్నాయి. పరిశ్రమలకు, ఫార్మా సిటీకి, ఐటీ పరిశ్రమలకు, గ్రీన్ జోన్‌కు, రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రియాల్టీ మార్కెట్ మరింత పెరిగే అవకాశముంది. వృద్ధికి ఆస్కారమున్న ప్రాంతాల్లో రియాల్టీ మార్కెట్ పెరగడంతో పాటు కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కూడా పెరిగే చాన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఇక సిటీకి సమగ్ర మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే రింగ్ రోడ్డు నుంచి సిటీకి, రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డుకు ప్రత్యేక కనెక్టివిటి పెరుగుతుంది. మెట్రో రైల్ కనెక్ట్ విషయంలో కూడా క్లారిటీ రావడమే కాకుండా ప్రాజెక్టుకు అడుగులు పడుతాయి. వీటితో పాటు తాగు, విద్యుత్ వంటి మౌలిక విషయాలలో ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ప్రకారం డెవలప్ చేయాల్సి ఉంటుంది.ఇక జీహెచ్ఎంసీ విషయానికి వస్తే 2007లో 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయితీలను కలిపి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సుమారు 1కోటి జనాభ ఉన్న కారణంగా.. 150 డివిజన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందుతున్నా కానీ.. హైదరాబాద్ చుట్టూ ఉన్న.. 21 పురపాలక సంఘాలలో మాత్రం ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో.. ఇప్పుడు వాటిని కూడా డెవలప్ చేసి .. మెగా గ్రేటర్ హైదరాబాద్ గా రూపుదిద్దాలనే .. ఒక మాస్టర్ ప్లాన్ తో ముందుకు వెళ్తున్నారు అధికారులు..ప్రస్తుతం బల్దియా పరిధిలో 150 డివిజన్లు ఉన్నాయి. దాదాపు 74 లక్షలమంది ఓటర్లు ఉన్నారు. జనాభా కోటి వరకు ఉంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను బల్దియాలో విలీనం చేస్తే జనాభా మరో 60 లక్షల వరకు పెరుగుతుంది. అదనంగా మరో 50 నుంచి 60 డివిజన్ల వరకు పెరుగుతాయని అధికారుల అంచనా. అప్పుడు 210 వరకూ డివిజన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మెగా గ్రేటర్ కు పెద్దగా ఉంటుందని భావించిన సీఎం రేవంత్ రెడ్డి దీనిని రెండు విభాగాలు గా చేయమని అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రస్తుతం ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 7 కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారనే చర్చ జరుగుతోంది. రాజధాని పరిధిలో ప్రస్తుతం 5 మాస్టర్ ప్లాన్లు ఉండటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఐదింటిని విలీనం చేసి.. వచ్చే 30 ఏళ్లు అమలులో ఉండే విధంగా ఒకే మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీనికి అనుగుణంగానే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇదే సమయంలో గ్రేటర్‌ను కూడా విస్తరించాలని సీఎం భావించారు. ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న సంస్థలన్నింటికీ కలిపి మెగా గ్రేటర్‌ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. 3 నెలల్లో దీనిపై ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించడంతో అధికారులు ప్రస్తుతం ఆ పనిలో ఉన్నారు

# తెలంగాణలో విత్తనాల లొల్లి...

అదిలాబాద్, : తెలంగాణలో విత్తనాలపై లొల్లి మొదలైంది. వర్షాలు రాక ముందు నుంచే విత్తనాల అమ్మకాలు షురూ చేసిన ప్రభుత్వానికి కష్టాలు తప్పడం లేదు. సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నటైంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఘటన మరింత విమర్శలపాలు చేస్తోంది.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కోసం అన్నదాతులు రోడ్డు ఎక్కారు. భారీగా వచ్చిన రైతులను కంట్రోల్ చేయడానికి పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. దీనిపై ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ కోతలతో అల్లడిపోతుంటే ఇప్పుడు ప్రభుత్వం విత్తనాలు కూడా అందివ్వలేని దుస్థితిలో ఉందా అంటూ ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ప్రతి సారీ ఇలాంటి పరిస్థితి ప్రజలకు తప్పడం లేదని బీఆర్ఎస్ నేతలు ఫైర్ అవుతున్నారు. విత్తనాల కోసం వారం రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతులపై లాఠీ ఛార్జ్ చేయడం ఏంటని ఆ పార్టీ ప్రశ్నిస్తోంది. కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు రోజురోజుకు అధికమవుతున్నాయని కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులని ప్రబుత్వం ఏం చేయలేకపోతోందని మండిపడుతోంది. అదిలాబాద్ లాఠీచార్జ్‌ని తీవ్రంగా ఖండించారు మాజీ మంత్రి కేటీఆర్.రైతన్నలపైన దాడి చేసిన ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతన్నలపైన దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. “విత్తనాల కోసం బారులు తీరిన రైతన్నలపై లాఠీచార్జ్ అత్యంత దారుణం. ఇది రైతన్నలపైన ప్రభుత్వ దాడి. ప్రభుత్వం ఏర్పడిన 5 నెలల్లో రాష్ట్ర వ్యవసాయాలను ముఖ్యంగా రైతన్నల పరిస్థితి పూర్తిగా దిగజారి పోయింది. రైతన్నలకు కావాల్సిన సాగునీటి నుంచి మొదలుకొని, రైతుబంధు పెట్టుబడి సహాయం వరకు, చివరికి కనీసం విత్తనాలు అందించలేని దుర్మార్గపూరిత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. మార్పు తెస్తాం, ప్రజాపాలన అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రైతన్నలపైన లాఠీఛార్జ్ పేరుతో దాడులు చేయడమే కాంగ్రెస్ తీసుకువస్తామన్న మార్పా?. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగం ఎలాంటి ఆందోళన పడకుండానే విత్తనాలు, ఎరువులు, 24 గంటల ఉచిత విద్యుత్తు అన్నింటిని సాఫీగా అందుకున్నది. కేవలం 5 నెలల్లోనే పరిస్థితి పూర్తిగా తారుమార అయింది. ఇది పూర్తిగా ప్రభుత్వ పరిపాలన వైఫల్యం.”ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతన్నలు పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. విత్తనాలు కూడా అందించలేని నిస్సహాయ స్థితికిచేరుకుంది. రైతన్నలపై చేసిన దాడికి క్షమాపణ చెప్పాలి. రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, వ్యవసాయ వ్యవసాయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న టైంలో సీఎం ఎన్నికల ప్రచారం పేరిట, ఢిల్లీ పర్యటన పేరిట రాజకీయాలు చేయడం ఏంటీ. “ముఖ్యమంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి విత్తనాల కొరత, పంపిణీ, ప్రభుత్వ వైఫల్యంపై ఉన్నత స్థాయి సమీక్ష ఏర్పాటు చేయాలి. రైతన్నల కష్టాలు తొలగించే విధానం తీసుకురావాలి. లాఠీ చార్జ్ చేసిన పోలీస్ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి” అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్‌లో విత్తనాల కోసం వచ్చిన రైతులపై లాఠీఛార్జ్ చేయడాన్ని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఖండించారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీలో వచ్చిన మార్పు అంటూ ప్రశ్నించారు. పాలన గాలికి వదిలేసి మంత్రులు, ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రులు ఇతర రాష్ట్రాల ప్రచారానికి వెళ్తారా అంటు నిలదీస్తున్నారు. “పత్తి విత్తనాలే కాదు .. ఎరువు కింద ఉపయోగించే జీలుగ విత్తనాల కోసం కూడా రైతులు ఆందోళనలు చేయాల్సి రావడం దురదృష్టకరం. జీలుగ విత్తనాలకే దిక్కులేదు. ఇక అసలు విత్తనాలు ఇస్తారన్న నమ్మకం రైతులలో ఎలా కలిగిస్తారు”రైతులకు విత్తనాలు ఇవ్వలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి క్షమాపణ చెప్పాలి అని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని మండిపడ్డారు.”కాంగ్రెస్ వచ్చి రాష్ట్రంలో పాతరోజులు మళ్లీ తెచ్చింది.

# త్వరలో మరిన్ని డయాలసిస్ సెంటర్లు

హైదరాబాద్: రాష్ట్రంలో అతి త్వరలో మరిన్ని డయాలసిస్ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో దాదాపు 150 కేంద్రాలు నడుస్తు న్నాయి. వీటి సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్పొరేషన్‌లో రివ్యూ నిర్వహించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే 9 మెడికల్ కాలేజీలు, డయాలసిస్ సెంటర్లు పెంపు, టీ హబ్ ల్యాబ్ పరిస్థితిపై ఆయన సమీక్షించారు. రాష్ట్రంలో కిడ్నీ ఫెయిల్యూర్ పేషెంట్ల సంఖ్య రెట్టింపు అవుతున్న నేపథ్యంలో వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేల రిక్వెస్టుల మేరకు డయాలసిస్ కేంద్రాలను పెంచాల్సి ఉన్నదని మంత్రి ఆఫీసర్లతో చర్చించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కేంద్రాల్లో నాలుగు, ఐదు సెషన్స్‌లో నిర్వహించాల్సి వస్తున్నది. దీంతో డయాలసిస్ పేషెంట్లు ఎక్కువున్న చోట మరిన్ని సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వైద్యారోగ్యశాఖ ఆయా సెంటర్ల ఏర్పాటుకు చొరవ చూపనున్నది. నేషనల్ మెడికల్ కమిషన్ విజిట్ నేపథ్యంలో కొత్త మెడికల్ కాలేజీల్లో అన్ని సౌకర్యాలు, స్టాఫ్‌ను సమకూర్చుకోవాలని మంత్రి సూచించారు. మరోవైపు టీ డయాగ్నస్టిక్ హబ్స్ అన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకురానున్నారు. జిల్లా ఆసుపత్రులు ఐసీటీసీ, ఐడీఎస్పీ, టీబీ ఇలా ఈ ల్యాబ్స్‌లలో వేర్వేరుగా శాంపిళ్లు సేకరించి టెస్టులు చేస్తున్నారు. ఇక నుంచి ఇవన్నీ ఒకే చోట పూర్తవుతాయి. అంతేగాక అన్ని రిపోర్టులు ఆన్ లైన్ అందజేయనున్నారు. ఇప్పటి వరకు కేవలం టీ హబ్స్ ల్యాబ్స్‌లోనే ఆన్ లైన్ రిపోర్టులు ఇస్తున్నారు. ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏ ప్రభుత్వాసుపత్రుల్లో టెస్టులు చేసినా, అంతా ఆన్ లైన్‌లోనే ఇవ్వనున్నారు. అత్యవసర టెస్టులను కూడా పొందుపరచనున్నారు.

# సస్పెన్స్ థ్రిల్లర్ ను తలపిస్తున్న పూణె కేసు

ముంబై: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె పోర్షే కారు కేసు రోజుకో మలుపు తిరుగుతూ సస్పెన్స్ థ్రిలర్ ను తలపిస్తోంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న పుణె క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ససూన్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ అజయ్ తవాడే, డాక్టర్ హరి హర్నోర్ ను అరెస్ట్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే నిందితుడి నుంచి రక్తంను సేకరించిన ఫోరెన్సిక్ విభాగానికి పంపిస్తారు. కానీ ఫోరెన్సిక్ కు పంపిన రక్తం నిందితుడికి కాదని పుణె పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ మీడియాకు వివరించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ..‘మే 19వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో ససూన్ ఆసుపత్రిలో మైనర్ అయిన నిందితుడి నుంచి తీసుకున్న రక్తనమూనాలను చెత్త బుట్టలో పడేసి, మరో వ్యక్తి శ్రీహరి హల్నార్ రక్తనమూనాను ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించారు. ససూన్ ఆసుపత్రిలోని ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్ఓడీ అజయ్ తవాడే సూచనల మేరకు శ్రీహరి హల్నోర్ దీన్ని మార్చినట్లు దర్యాప్తులో కనుగొన్నాం.’ అని అమితేష్ కుమార్ చెప్పారు.ఇద్దరు డాక్టర్ల ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన రోజు డాక్టర్ తవాడే, యువకుడి తండ్రి ఫోనులో మాట్లాడినట్లు దర్యాప్తులో తేలిందని కుమార్ మీడియాకు తెలిపారు.ప్రస్తుతం అబ్జర్వేషన్ హోమ్ లో ఉన్న మైనర్ ఆల్కహాల్ పరీక్షల్లో నెగెటివ్ వచ్చినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఆ రాత్రి అతను బార్ లో స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్నట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డు అయ్యింది.ఈ కేసు మద్యం మత్తులో చేసిన పొరపాటుగా తాము భావించడం లేదని, పూర్తి స్పృహతోనే చేసినదిగా భావిస్తున్నామని కమిషనర్ అన్నారు. రెండు బార్లలో పార్టీలు చేసుకున్న మైనర్ ఇరుకైన, రద్దీగా ఉండే వీధుల్లో నెంబర్ ప్లేట్ లేని కారును వేగంగా నడపడం పూర్తి స్పృహలో ఉన్నాడు. తన చర్య వల్ల ప్రజలు చనిపోతారని అతనికి తెలుసు.’ కచ్చితమైన ఫలితాలను నిర్ధారించడానికి నిందితుడి రక్తం రెండు నమూనాలను ప్రమాదం తర్వాత వేర్వేరు సమయాల్లో పరీక్షించినట్లు నగర పోలీసు చీఫ్ తెలిపారు.మొదటి నమూనాలో అతని శరీరంలో ఆల్కహాల్ లేదని, అలాగే రెండో నమూనాలో కూడా అదే రిజల్ట్ రావడంతో అనుమానంతో డీఎన్ఏ పరీక్ష చేస్తే అసలు రక్తం ఆయనది కాదని తేలిందన్నారు. అంటే నిందితుడి బ్లడ్ కు బదులు మరో వ్యక్తి బ్లడ్ ఫోరెన్సిక్ కు పంపారని తేలిందని చెప్పారు.నిందితుడు ప్రముఖ రియల్టర్ కుటుంబానికి చెందిన సంపన్నుడని, అతడిని కాపాడేందుకు అతని తండ్రి, తాత న్యాయ వ్యవస్థను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని సీపీ ఆరోపించారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ కింద యువకుడి తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. కారు తానే నడిపానని చెప్పాలని డ్రైవర్ పై ఒత్తిడి తేవడంతో అతని తాతను కూడా అరెస్ట్ చేశారు. మైనర్ నిందితుడు రెండు బార్లలో మద్యం తాగుతున్నట్లు ఆధారాలు ఉన్నాయి. దీనికి తోడు బార్ల సిబ్బంది, యజమానులకు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వైద్యులు బ్లడ్ శాంపిళ్లు మార్చారనేందుకు మరింత బలం చేకూరుతోంది.అశ్విని కోస్తా, అనీష్ అవధియా అనే ఇద్దరు టెక్కీలు బైక్ పై వెళ్తుండగా పోర్షే కారు వారి బైక్ ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన 15 గంటల్లోనే బాలుడికి షరతులతో బెయిల్ మంజూరైంది. రోడ్డు ప్రమాదాలపై 300 పదాల వ్యాసం రాయాలని, ట్రాఫిక్ పోలీసులతో 15 రోజులు పనిచేయాలని, తాగుడు అలవాటుకు కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు.దీనిపై దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో జువెనైల్ జస్టిస్ బోర్డు ఆ ఉత్తర్వులను సవరించి అబ్జర్వేషన్ హోమ్ కు పంపింది. 17 ఏళ్ల 8 నెలల వయసున్న టీనేజ్ నిందితుడిని వయోజనుడిగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు జువైనల్ బోర్డును కోరారు. ప్రస్తుతం ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఇది ప్రమాదవశాత్తు కాకుండా హత్య అని, నింధితులను కఠినంగా శిక్షించాలని ఇద్దరు ఇంజినీర్ల కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కార్పొరేట్ స్కూల్ లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి.

## జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



జయశంకర్ భూపాలపల్లి, కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. భూపాలపల్లి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి గ్రామీణ ప్రాంతాల్లో 22 పాఠశాలల్లో 160.29.లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పన పనులను చేపట్టినట్లు తెలిపారు. పెద్దాపూర్ లో 12.25 లక్షల, నేరేడుపల్లి లో 15.27 లక్షలు వజినేపల్లి 4.87 లక్షలు, రాంపూర్ లో 6 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పనకు నిధులు వెచ్చించి ప్రభుత్వ బడులలో మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు పున ప్రారంభం నాటికి ఏ ఒక్క పని పెండింగ్ లేకుండా సంపూర్ణంగా పూర్తి చేసి ఆహ్లాదకరంగా తయారు చేయాలని అన్నారు. బడులు బాగుచేసుకోవడంతో పాటు విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, విద్యార్థులు భోజనం తదుపరి చేతులు కడుక్కోవడానికి హ్యాండ్ వాష్ ప్లాట్ ఫారం ఉండాలని పేర్కొన్నారు. మనమే విద్యార్థులమైతే ఎలాంటి సౌకర్యాలు ఉంటే బావుంటుందని కోరుకుం టామో అదే స్థాయిలో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం, కనీస సౌకర్యాలు, నాణ్యమైన విద్యను అందించాలని ఆయన సూచించారు. ఖర్చుకు వెనకాడకుండా జిల్లాలో మరమ్మత్తులు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అంధించేందు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పన పనులు చురుకుగా జరుగుతున్నాయని అన్నారు. పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. నిధులు కొరత రాకుండా పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు మహిళా సంఘాలకు అంచనా ప్రతిపాదనలు మేరకు 25 శాతం ముందస్తు నిధులు మంజూరు చేశామని అన్నారు. పూర్తి అయిన పనులకు ఎలాంటి జాప్యం లేకుండా బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. చేపట్టిన పనులకు చెల్లించిన ప్రతి రూపాయి లెక్క పక్కాగా ఉండాలని, అందుకు రిజిస్టర్లలో నమోదులు చేయాలన్నారు. మరమ్మతులు చేపట్టకు ముందు, పనులు జరుగుతున్నపుడు, పనులు పూర్తి అయిన తదుపరి మూడు దశల ఫోటోలు భద్రపరచాలని తెలిపారు. పాఠశాలల మైదానాలు ఎత్తు, పల్లాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచేందుకు ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా చదను చేయాలని అన్నారు. నీళ్లు నిలిచే అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థలం ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి రాజ్ డి ఈ వెంకటేశ్వర్లు, ఏఈ సురేష్ కుమార్, ఎంపిఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేబినెట్‌లోకి మైనంపల్లి...?

మెదక్: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల సంగ్రామం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను లోక్‌సభ ఎన్నికల్లోనూ రిపీట్ చేయాలని, తెలంగాణలొ మెజారిటీ ఎంపీ స్థానాలను ‘చే’జిక్కించుకోవాలని టీపీసీసీ చీఫ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నీ తానై వ్యవహించారు. 15 నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఏకంగా ఏడు సభలు నిర్వహించారు.ఎన్నికల సంగ్రామం ముగిసింది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఫలితాలతో సంబంధం లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టిపెట్టారు. ఇటీవలే కేబినెట్ మీటింగ్ నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీకి కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.పూర్తిస్థాయి పాలనను అందించేందుకు తెలంగాణలో ఖాళీగా ఉన్న కేబినెట్ స్థానాలు భర్తీ చేయాలని సీఎం నిర్ణయించారు. మొత్తం 17 స్థానాలకు 11 స్థానాలే భర్తీ చేశారు. ఇంకా ఆరు ఖాళీగా ఉన్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కేబినెట్ విస్తరణతోపాటు నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ స్థానాలు భర్తీ చేయాలని రేవంత్ భావిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు, నేతల పనితీర, పార్టీ విధేయులకు ఇటు మంత్రిర్గంలో అటు పార్టీలో, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు.పూర్తిగా పాలనపై దృష్టి సారించేందుకు సీఎం రేవంత్ పీసీసీ పదవి నుంచి కూడా తప్పుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు అధిష్టానానికి సమాచారం ఇచ్చారు. తన వారసులుగా ఎవరిని నియమించాలో కూడా ప్రతిపాదించారు. ఎన్నికల ఫలితాల ఆధారంగా రేవంత్ ప్రతిపాదన ఆమోదం పొందే అవకాశం ఉందిఇక తెలంగాణ కేబినెట్‌లోకి యువ నేతలు తీసుకోవాలని కూడా కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. ఈమేరకు సీఎం రేవంత్‌కు సూచనప్రాయంగా సమాచారం అందించింది. యువతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలియజేసేందుకు ఇప్పటికే బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. ఇక కేబినెట్‌లోకి కూడా ఓ యువ ఎమ్మెల్యేను తీసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో అతి చిన్న వయస్కుడైన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పేరు తెరపైకి వచ్చింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావు అనూహ్యంగా తనతోపాటు, తన కొడుకు రోహిత్‌కు టికెట్ తెచ్చుకున్నారు. ఎన్నికల్లో హన్మంతరావు ఓడిపోగా, రోహిత్ విజయం సాధించారు. ఇప్పుడు కేబినెట్‌లోకి యువ నేతను తీసుకోవాలని అధిష్టానం భావించిన నేపథ్యంలో తన కొడుకుకు మంత్రి పదవి దక్కేలా ఢిల్లీలో చక్రం తిప్పారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే రోహిత్ మంత్రి కావడం ఖాయం. అదే జరిగితే రోహిత్ రొట్టెముక్క తేనెలో పడినట్లే

# నకిలీ విత్తనాలు...

అదిలాబాద్,: ప్రతి ఏడాది నకిలీ విత్తనాలు ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. ప్రతీ వానాకాలంలో నాసిరకం, నకిలీ విత్తనాల బెడద రైతులకు పెను సవాల్‌గా మారింది. ఫర్టిలైజర్ వ్యాపారుల మాయజాలంతో రైతులు మోసపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా కొందరు ఈ దందాను సాగిస్తుంటే? అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానాకాలం సీజన్‌కు ముందే గ్రామాల్లో తిష్ఠ వేసి రైతులను నట్టేట ముంచుతున్నారు. అమాయక రైతులే టార్గెట్‌గా ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి. అనుమతి లేని విత్తనాలు అన్నదాతలకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం అదే రిపీట్ అయింది.నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వార్నింగ్ ఇస్తున్నా? ఎక్కడ కూడా నకిలీగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ కేంద్రంగా నకిలీ ముఠా రెచ్చిపోయింది. హుస్నాబాద్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించి? 9 క్వింటాళ్ల 72 కిలోల నకిలీ విత్తనాలు సీజ్ చేశారు. వేణు అనే వ్యక్తి సరఫరా చేసినట్టు గుర్తించారు.

అంతేకాదు సాకేత్, రేవంత్ రకం విత్తనాలకు భారీ డిమాండ్ ఉండటంతో ధరలు పెంచి రైతులను దోచుకుంటున్నారు. అటు మిర్యాలగూడలో 5లక్షల విలువ చేసే నకిలీ విత్తనాలను సీజ్ చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు.మరోవైపు సీజన్ ఆరంభంలోనే విత్తనాల కొరత ఏర్పడింది. డిమాండ్‌కి తగ్గట్టు సరఫరా లేకపోవడంతో విత్తనాల కోసం.. రైతులు ఆగ్రో కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కామారెడ్డి జిల్లాలో 5లక్షల 30 వేల ఎకరాల్లో పంటలు సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు.. రైతుల కోసం 10వేల 300 మెట్రిక్ టన్నుల జిలుగు, 2వేల 366 క్వింటాళ్ల జనుము, 50 వేల 900 క్వింటాళ్ల యూరియా అవసరం అవుతుంది. కానీ, ఇప్పటివరకు ఇందులో సగం కూడా రైతులకు అందలేదు. ఎరువులు, విత్తనాల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. సరిపడా విత్తనాలు అందక నానా పాట్లు పడుతున్నారు.ఈ సీజన్‌లో ప్రారంభంలోనే భారీగా నకిలీ విత్తనాలను వివిధ శాఖల అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. ఓవైపు అక్రమార్కులపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నా మరోవైపు అనుమతిలేని విక్రయాలు విస్తుగొలుపుతున్నాయి. మరింత అప్రమత్తం కాకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని గత అనుభవాలు హెచ్చరిస్తున్నాయి.

# తెలంగాణ అంతా ఆహార తనిఖీలు...

ఖమ్మం,: ఖమ్మం, మేడ్చల్ జిల్లాలోను ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు చేశారు ఫుడ్ సేఫ్టీ అధికారులు. కుళ్ళిన కబాబులు, ఎక్స్‌పైరీ మసాల దినుసులు సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో హోటల్స్, రెస్టారెంట్ల యాజమానులు హడలిపోతున్నారు. .ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతన్న పేరు మోసిన రెస్టారెంట్లు, హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ అధికారుల మెరుపు దాడులు కొనసాగుతున్నాయి. గతం వారం రోజులుగా హైదరాబాద్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్‌లపై రైడ్స్ చేసి వాటి భాగోతం బట్టబయలు చేస్తున్నారు. లొట్టలేసుకొని లాగించే ఫుడ్ ప్రియుల కళ్లు తెరిపిస్తున్నారు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో జరుగుతున్న వాస్తవి పరిస్థితిని ప్రజల కళ్లకు కడుతున్నారు. ప్రముఖ రెస్టారెంట్లు, హోటళ్లపై మెరుపు దాడులు చేసి కాలం చెల్లిన ఫుడ్, వస్తువులు, నూనె సీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా మేడ్చల్‌లోని తాజా హాలిడే రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. స్టోర్ రూమ్‌లో ఫుడ్ కలర్స్ గుర్తించారు అధికారులు. అలాగే కుళ్లిపోయిన కూరగాయలు, నిమ్మకాయలు గుర్తించారు. లేబుల్ లేని టీపొడి, పురుగులు పట్టిన కొర్రలు సీజ్ చేశారు. అంతేకాకుండా వట్టినాగులపల్లి ప్రిజం రెస్టారెంట్, బార్‌లో తనిఖీలు చేశారు అధికారులు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు సీజ్ చేశారు. వంటగదిలో దుర్వాసన, మురుగు నీరు పేరుకుపోయినట్లు గుర్తించారు.హైదరాబాద్‌లో స్టార్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ దాడులను తెలంగాణ వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. ఖమ్మంలోని ప్రముఖ హోటల్స్, రెస్టారెంట్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. రెస్ట్ ఇన్, శ్రీశ్రీ, హవేలీ రెస్టారెంట్‌లో తనిఖీలు కొనసాగించారు. విస్తుపోయే నిజాలు కళ్లకు కట్టారు. నిల్వ ఉంచిన పాచిపోయిన చికెన్, నాసిరకం మసాలాలు సీజ్ చేశారు. రెస్ట్ ఇన్ హోటల్లో వినియోగదారులకు విక్రయించేందుకు నిల్వ ఉంచిన చికెన్ కబాబ్ లను కాల్వలో వేయించారు ఫుడ్ కంట్రోలర్ అధికారులు. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించిన అధికారులు హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.పాడైపోయిన, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలతో వేడివేడిగా వంటకాలు తయార్ చేయడమే కాకుండా.. ఎక్స్‌పైరీ అయిపోయిన ఇంగ్రీడియంట్స్‌తో బిర్యానీ రెడీ చేస్తున్నట్లు అధికారులు రైడ్స్‌లో గుర్తించారు. అంతేకాదు కల్తీ నూనెలు, పాలు, మసాలా దినుసులు, తృణధాన్యాలు, పిండి, వాటర్ బాటిల్స్ సహా దేనిని వదలకుండా ప్రతీదాన్ని కల్తీ చేసి ఫుడ్ తయార్ చేస్తున్నారు. ఇక ఐస్‌క్రీమ్స్, కాఫీ, టొమాటో సాస్, వెజిటెబుల్ ఆయిల్స్, నెయ్యి.. ఇలా ఏ ఆహార పదార్థాన్ని తీసుకున్నా.. అన్నింట్లోనూ అదే దుస్థితి కొనసాగుతోంది. రెస్టారెంట్లు, హోటళ్లు?ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో.. ప్రజల ఆరోగ్య భద్రతా ప్రమాణాల దృష్ట్యా ప్రభుత్వం సీరియస్ ఆదేశాలు జారీచేసింది. కల్తీ విషయంలో ఎంత పెద్ద వారున్న ఉపేక్షించేదే లేదంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. దాంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడుల కొరడా ఝుళిపించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులతో హోటల్స్, రెస్టారెంట్ల నిర్వాహకుల్లో వణుకుమొదలైంది. ఏక్షణం, ఎటు వైపు నుంచి ఏ అధికారి వచ్చి రైడ్ చేస్తాడో తెలియక టెన్షన్ పడుతున్నారు.

# భయపెడుతున్న హోర్డింగ్ లు

హైదరాబాద్: వర్షాకాలం అంటే అందరికీ వెన్నులో వణుకే?ప్రమాదం ఏ రూపంలో వస్తుందో తెలియని పరిస్థితి. ఇంటి నుంచి బయటకు వచ్చామంటే చాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే.

నాలాలు, మ్యాన్‌హోల్స్, విద్యుత్ స్తంభాలు, ప్రహరీలు, సెల్లార్ గుంతలు, కరెంట్ తీగలు, కూలిపోయే చెట్లు ఇలా ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి. ఈ జాబితాలో హోర్డింగ్స్‌లు వచ్చి చేరాయి. గ్రేటర్‌లో వాణిజ్య ప్రకటనల కోసం ఏర్పాటు చేసే బోర్డులు 15 ఫీట్లకు తగ్గకుండా ఉండాలి. కానీ చాలా చోట్ల కొందరు అధికారుల ప్రమేయంతో నిబంధనలను ఉల్లంఘించి..హోర్డింగ్‌ల ఎత్తు పెంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మెట్రో కారిడార్ లక్ష్యంగా సికింద్రాబాద్, హైటెక్ సిటీ ఇతర ప్రాంతాల్లో 15 ఫీట్లకు మించి హోర్డింగ్‌లు ఉండటం, ఈ క్రమంలోనే బలహీనమైన ఫ్లెక్సీలు చిరిగిపోయి వాహనదారులను, కరెంట్ స్తంభాలను కప్పేస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో హోర్డింగ్‌లు, కొట్టుకొస్తున్న ఫ్లెక్సీలతో స్థానికులతో పాటు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో ఫ్లెక్సీలు విద్యుత్ తీగలపై పడుతుండటంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు చెబుతుండటం ఇందుకు నిదర్శనం.నగరంలో ఏర్పాటు చేసే హోర్డింగ్స్ ప్రజలకు ఎలాంటి ప్రమాదం కలిగించకుండా ఉండేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. వ్యాపార ప్రకటనతో పాటు హోర్డింగ్ సామర్థ్యం పరీక్షించి సర్టిఫికెట్‌ను జారీ చేయాలి. కానీ ఆ దిశగా తనిఖీలు జరగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 15 మీటర్ల వరకు ఉన్న హోర్డింగ్‌లు సైతం పక్కాగా.. నిబంధనల ప్రకారం నడపాల్సిన చోట సదరు ఏజెన్సీలు మెట్రో పిల్లర్లే లక్ష్యంగా అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ధనార్జనే ధ్యేయంగా హోర్డింగ్‌ల ఏర్పాటు చేస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు.ఈ తరహా సర్దార్ పటేల్ రోడ్ (శివాజీనగర్), సైబర్ సిటీ టవర్, శిల్పారామం రోడ్ ఇలా కొన్ని చోట్ల అర్ధరాత్రి పూట వయా డక్ట్ హోర్డింగ్ పనులు జరుపుతున్నారు. ఈ పనులను పర్యవేక్షించే అధికారులు లేరు. ప్రమాదకర స్థాయిలో ఈ పనులు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బలహీనమైన ఫ్లెక్సీలతో ఇబ్బందులు వస్తున్నాయని గ్రేటర్ విద్యుత్ అధికారులు చెబుతున్నారు. కరెంట్ తీగలపై ఫ్లెక్సీలు పడుతుండటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నదని, ప్రమాదకర హోర్డింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు.

# పాలమూరు వర్శిటీ వీసీ కోసం పోటీ

మహబూబ్ నగర్: ఒక్క వీసీ పోస్టు.. వందకుపైగా అప్లికేషన్లు. అవును వినడానికి కొంత వింతగా ఉన్నా ఇది వాస్తవం. అసలే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100కోట్ల నిధులు వచ్చాయి. దానికి తోడు సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోని యూనివర్సిటీ. ఇంకేముంది ఎన్నడూ లేని విధంగా యూనివర్సిటీ వీసీ పోస్టుకు తెగ డిమాండ్ ఏర్పడింది. పాలమూరు యూనివర్సిటీ వీసి పోస్ట్?కి తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధిక అప్లికేషన్?లు వచ్చిన వర్సిటీల్లో మూడో స్థానంలో ఉంది పీయూ. ముఖ్యమంత్రి సొంత జిల్లా కావడం, ఇటీవలే వందకోట్ల నిధులు రాకతో ఈ పోస్ట్?కి డిమాండ్ మరింత పెరిగింది. ఇక పోస్టు కోసం పొలిటికల్ రెఫరెన్స్?ల కోసం నేతల చుట్టూ ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పోస్టుల నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన వారందరూ వీసీ పోస్టులకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. మహబూబ్?నగర్ జిల్లాలోని పాలమూరు విశ్వవిద్యాలయం పోస్ట్?కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ తరువాత అత్యధికంగా పాలమూరు యూనివర్సిటీ వీసీ పోస్టుకే అప్లికేషన్?లు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే యూనివర్సిటీ ఉండటంతో మరింత ప్రాధాన్యం పెరిగింది. అయితే ఈ సారి పోటీ ఎక్కువగా ఉండటంతో వీసి పదవీ ఎవరిని వరిస్తుందో అనే చర్చ జోరుగా సాగుతోంది. వీసి నియామకంలో గతం నుండే రాజకీయ ప్రమేయం కీలకంగా ఉంది. చాలావరకు అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నవారికే పదవీ దక్కుతుందని టాక్ నడుస్తోంది. ఈ కారణంగా ఆశావాహులు అధికార పార్టీ నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పాలమూరు యూనివర్సిటీ ప్రస్తుత వీసి ప్రొఫెసర్ ఎల్ బి లక్ష్మి కాంత్ రాథోడ్ పదవీకాలం ఇటీవలే ముగిసింది. దీంతో వీసి పదవికి అర్హులైన వారు 159 మంది దరఖాస్తు చేసుకున్నారు.ప్రొఫెసర్?గా పదేళ్ళ అనుభవం.. ఎలాంటి వయో పరిమితి లేకపోవడంతో ఎక్కువ మంది అప్లై చేసుకున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్స్, పీయూలో రిజిస్టార్?గా పని చేసి ఇతర వర్సిటీలకు బదిలీపై వెళ్లిన వారు దరఖాస్తు చేశారు. అయితే ఈసారి వడపోత చాలా కఠినంగా ఉంటుందనే చర్చ సాగుతోంది. సీఎం సొంత జిల్లా కావడంతో పీయూపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లుగా సమాచారం. ప్రస్తుత వీసి కూడా మరోసారి అవకాశం కోసం ప్రయత్నం చేస్తున్నారట. ఆయన హాయంలోనే వందకోట్ల నిధులు మంజూరు కావడం, సీఎం నియోజకవర్గంకు సంబంధించిన వ్యక్తి కావడం, అధికార పార్టీ నేతల ఆశీస్సులు ఉన్నాయనే చర్చ కూడా నడుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ ప్రమేయం లేకుండా విద్యార్థులకు మంచి సేవలు అందించే వారికే వీసీగా అవకాశం ఇవ్వాలని విద్యార్థులు, జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# పిల్లలను విక్రయించే ముఠా...

హైదరాబాద్: అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ దేశ వ్యాప్తంగా పసి పిల్లల అమ్మకాలు మాత్రం ఆగడం లేదు. సంతానం లేని తల్లిదండ్రులు లక్షలకు లక్షలు కుమ్మరించి కొంటున్నారు. అభంశుభం ఎరుగని చిన్నారులకు వెల కడుతున్నారు. ముక్కుపచ్చలారని పిల్లలను అంగట్లో సరుకులాగా కొంటున్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను పెంచే స్థోమత లేకనో లేక కాసులకు కక్కుర్తి పడో బిడ్డలను అమ్ముకుంటున్నారు. ఇటీవల కాలంలో బిడ్డల అమ్మకాలకు దళారులు కూడా ఏర్పడి లక్షలకు లక్షలు సంపాదించు కుంటున్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు కాసుల ఆశ చూపించి నెలల రోజుల పిల్లలను కొనుగోలు చేస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి బిడ్డలను చేతులు మారుస్తు కాసులు సంపాదిస్తు న్నారు. అలా కొనుగోలు చేసిన పిల్లలను కఠిన జీవితానికి బలి చేస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పిల్లల విక్రయాల ఘటన సంచలనం రేపుతోంది. పిల్లలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. 16 మంది చిన్నారులను మేడిపల్లి పోలీసులు కాపాడారు. రక్షించిన చిన్నారుల్లో తెలంగాణకు చెందిన వారే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన పిల్లలు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా మేడిపల్లిలో పసికందు విక్రయంతో ఈ ముఠా ఆగడాలు బయటపడ్డాయి. మొత్తం 16 మంది పసి బిడ్డలను ఈ ముఠా విక్రయించినట్లు గుర్తించారు. ఫిర్జాదిగూడలో 4.5 లక్షల రూపాయలకు చిన్నారిని ఆర్ఎంపీ శోభారాణి విక్రయించారు. ఆర్ఎంపీ, ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొంత కాలంగా హైదరాబాద్ శివారులో పసి పిల్లల అమ్మకాలు జోరుగా సాగుతు న్నాయి. మేడిపల్లి కేంద్రంగా చిన్నారుల అమ్మకాలు కొనసాగిస్తున్నారు. స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ ఇతర రాష్ట్రాల నుంచి పిల్లల్ని తీసుకుని వచ్చి పిల్లలు లేని తల్లిదండ్రులకు అమ్ముతున్నారు. ఒక్కో పిల్లాడిని దాదాపు లక్ష నుంచి రూ. 5 లక్షల నగదుకు ఈ ముఠా విక్రయిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న బాలల హక్కుల సంఘం ఈ విషయాన్ని బట్టబయలు చేసింది. ఈ ముఠా ఆగడాలపై పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఓ తల్లీకొడుకుతో పాటు ఇద్దరు ముఠా సభ్యులు ఉన్నారు. మరోవైపు పిల్లలను కొన్న పేరెంట్స్ పైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. పిర్జాదిగూడ రామకృష్ణ నగర్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అడ్డాగా మూడు నెలల పసికందు నుంచి ఏడాది పిల్లల వరకు అమ్మకాలు కొనసాగుతున్నాయి. 16 మంది చిన్నారులను ట్రేస్ చేసి పోలీసులు వారిని కాపాడారు. ఇప్పటి వరకు మొత్తం 50 మందిని అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. అక్షర జ్యోతి ఫౌండేషన్ స్టింగ్ ఆపరేషన్‌లో ఈ అవాక్కయ్యే ఘటన వెలుగులోకి వచ్చింది. ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారిని పోషించడం మీకు భారమంటూ తల్లులకు చెప్పి.. మానవత్వంతో పిల్లలు లేనివారికి దత్తత ఇస్తామంటూ నమ్మించి విక్రయాలు చేస్తున్నారు.

పోలీసులు పేర్కొన్న నిందితులు..

o1 శోభారాణి,
o2 హేమలత అలియాస్ స్వప్న,
o3 షేక్ సలీమ్
o4 బండారి హరి హర చేతన్
o5 బండారి పద్మ
o6 బలగం సరోజ
o7 ముదావత్ శారద
o8 ముదావత్ రాజు
o9 పఠాన్ ముంతాజ్
o10 జగనాదం అనురాధ

# పాఠశాలలు లేని గ్రామాలు 265

నల్గొండ: రాష్ట్రంలో 265 గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు లేవని విద్యాశాఖ అధికారులు లెక్కల ద్వారా తేలింది. పిల్లలు లేరనే కారణంతో గత ప్రభుత్వ హయాంలో మూతపడ్డ పాఠశాలలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. వీటిలో మెజార్టీ స్కూళ్లను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో నూతన పాఠశాలలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ప్రతీ గ్రామ పంచాయతీలో తప్పకుండా ప్రభుత్వ పాఠశాల ఉండాలన్న సీఎం నిర్ణయం మేరకు ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.మేరకు అధికారులు రాష్ట్రంలో మూతపడ్డ పాఠశాలల వివరాలు సేకరించడంతో నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగానే డిసెంబరులో విద్యాశాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా నూతన పాఠశాలల ఏర్పాటుపై వివరాలు సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించిన విషయం విధితమే. ఏ ఒక్క బాలుడు గానీ, బాలిక గానీ చదువు కోసం ఇతర గ్రామాలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో గత నాలుగు నెలలుగా విద్యాశాఖ అధికారులు మూసివేసిన పాఠశాలల పునరుద్ధరణకు కసరత్తులు చేస్తున్నారు.రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా, 265 గ్రామపంచాయతీల్లో పాఠశాలలు లేవని తేలింది. వీటిలో 206 గ్రామ పంచాయతీల్లో స్కూళు అవసరమని అధికారులు గుర్తించారు. మరో 62 గ్రామాల్లో పిల్లలు లేకపోవడంతో స్కూళ్ల ఏర్పాటు అవసరం లేదని సర్కారుకు నివేదిక అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పిల్లలు లేరనే కారణంతో పాఠశాలలను మూసివేస్తే.. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించేందుకు మొగ్గుచూపడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అలాగే, మూతపడ్డ స్కూళ్లనూ రీఓపెన్ చేయించేందుకు సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది.రాష్ట్రంలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 24 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. కరీంనగర్, యాదాద్రి భువనగిరి జిల్లాలో 21 చొప్పున, వరంగల్‌లో 16 కొత్త స్కూళ్లను ప్రారంభించనున్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 14 పంచాయతీల్లో స్కూళ్లు లేవని, ఇందులో 11 గ్రామపంచాయతీల్లో కొత్త స్కూళ్లు అవసరం లేదని అధికారులు గుర్తించారు. వరంగల్ జిల్లాలో 24 జీపీల్లో స్కూళ్లు అందుబాటులో లేకపోగా, ఇందులో 12 గ్రామపంచాయతీల్లో అసలు కొత్త స్కూళ్లే అవసరం లేదని వెల్లడించారు.హైదరాబాద్, గద్వాల, మేడ్చల్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలు మినహా ప్రతి జిల్లాలోనూ ఒకటి ఆపై స్కూళు మూతపడ్డాయి. గ్రామాల్లో కొత్త స్కూళ్లను ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై కూడా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్‌లో జరిగే బడిబాటలో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పిల్లలను గుర్తించి, వారికి స్కూళ్లలో అడ్మిషన్లు ఇప్పించాలని భావిస్తున్నారు. అందుబాటులో ఉన్న టీచర్లనే కొత్త స్కూళ్లలో సర్దుబాటు చేయాలని యోచిస్తున్నారు.విద్యా శాఖపై సీఎం నిర్వహించిన సమీక్షలో భాగంగా గ్రామంలో పాఠశాల ఉండాలనే నిర్ణయంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఎక్కడ పాఠశాల అవసరం? పిల్లల ఎన్ రోల్ తక్కువగా ఉండి.. ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండి ఆ గ్రామానికి దగ్గరగా ఉంటే సదరు పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసేలాగా కసరత్తు చేస్తున్నాం. ప్రస్తుతం 1748 పాఠశాలల్లో జీరో ఎన్ రోల్ వుంది.


# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు**




ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్ నందు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం అధ్యక్షుతన జరిగిన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశంలో పోతినేని పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేస్తానని ప్రకటించిందని, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పంటల సాగుకు అప్పుల కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. తీసుకున్న అప్పులు తీర్చలేక ప్రభుత్వం రాయితీ చెల్లించకపోవడంతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడంలేదన్నారు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. పండిన పంట విక్రయిస్తే వడ్డీలకే సరిపోతోందన్నారు. పంట సీజన్ ప్రారంభమైంది కాబట్టి వెంటనే నూతన రుణాలు మంజూరు చేయాలని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారెంటీల అమలు చేయాలని కోరారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. సకాలంలో రైతుబంధు, రైతు బీమా, పింఛన్లు, అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో అమలయ్యే విధంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో సొంత ఇంటి నిర్మాణం పథకాన్ని అటకెక్కించారని తక్షణమే కాంగ్రెస్ ఇచ్చిన హామిలో భాగంగా రాష్ట్రమంతా అర్హులైన పేదలను గుర్తించి , అందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని స్థలమున్న వారికి ఇందిరమ్మ ఇంటి పథకం పేరుతో ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, కళ్యాణం వెంకటేశ్వరరావు,వై. విక్రమ్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వం నుండి పప్పు దినుసుల పంట సాగు



జుక్కల్: మండలంలో వ్యవసాయాదికారుల లెక్కల ప్రకారం గత ఎడాదీ ఏడు వేల ఎకరాలు పప్పు పంటసాగు చేస్తున్నారు. గతడేది కాకుండా పూర్వీకుల నుండి పప్పు దినుసుల పంటలు అనాదిగా రైతులు పండిస్తు వస్తువ్నారు. రోజురోజుకు పప్పుల రేట్లు విపరితంగా ధరలు పెర్గడంతో సామాన్యులకు ఉప్పులేని కూర " ఒప్పదు రుచులకు పప్ప లేని తిండి ఫలము లేదు" అన్న సామేతకు పేదల బతుకులు కొనసాగుతు వస్తోంది. ఏ ఫప్పులైన ఒక క్వింటాలుకు పదివేల పైనే ధర ఉండటంతో రైతులు కూడా పంట సాగుకు ఎక్కువ మ్నొగ్గు చూపుతున్నారు. 2024 ప్రస్తుతం ఖరీప్ పంటలో అత్యదికంగా పప్పు దినుసుల పంట సాగుకు రైతులు ఎందుకు ముందుకు వస్తున్నారంటే తొంబై నుండి నూటపది రోజులలో పంట రైతు చేతికి అందడం జర్గుతుంది. డబ్బులు చేతికంది రబిపంట కు పెట్టుబడికి ఉపయ్యోగపడు తుంది. పక్కనే ఉన్న మహరాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల రైతులు కూడా ఇటువంటి ప పంటల పైన ఎక్కువగా అధార పడి పండిస్తుంటారు.ప్రస్తుతం విత్తనాలు గతేడాది పండించిన రైతుల నుండి అప్పుగా తీసుకుని పంట పండినతరువాత తిరిగి తీసుకున్న దానికి ఇంకోంత కలిపి తిరిగి ఇవ్వడం జర్గుతుంది. ఈ సారీ పప్పుల దినుసుల పంటల సాగు గతేడాదీ కంటే పంట సాగు పరిగే ఇవకాశాలు ఉన్నాయి. రైతులకు పంట చేతికి అందడం కాక మంచి ధరలు పలుకుతాయానేగి రైతుల అభిప్రాయం.

# జూన్ 4 న రాష్ట్ర వ్యాప్తంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు ఈసీ ఆదేశం..

దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగింపు దశకు చేరడంతో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తోంది.

కౌంటింగ్ ఏర్పాట్లను న్యూ ఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ పర్యవేక్షించారు. ఎన్నికల సంఘం మార్గ దర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను వేగంగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సూచించారు. జూన్ 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఆదేశించారు.

ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రం జాప్యం చేయొద్దని సూచించారు. జూన్ 4న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఏపీలో కొన్ని చోట్ల ఎన్నికలకు సంబంధించిన హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 20 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కేటాయించామని, పికెట్లు ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. సున్నితమైన కేంద్రాలను గుర్తించడంతో పాటు, సమస్యలు సృష్టిస్తున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నట్టు చెప్పారు. ఎన్నికల ఫలితాల రోజు డ్రై డే, గా అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం అందుబాటులో ఉండదని సీఈఓ మీనా స్పష్టం చేశారు.

ఓట్ల లెక్కింపు రోజు ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ల వద్ద క్రౌడ్ మేనేజ్మంట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత పాస్ లేకుండా ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పవర్ బ్యాక్అప్, ఫైర్ సేఫ్టీ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర ఆరోగ్య సేవలు అందజేసేందుకు అంబులెన్సులను కూడా సిద్ధంగాఉంచుకోవాలన్నారు.




ఈవీఎంలలో పోల్ అయిన ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి ముందస్తుగానే శిక్షణ నివ్వాలని, సుశిక్షితులైన ఎన్నికల సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ వంటి ఐటి, పరికాలను ముందస్తుగా ఓట్ల లెక్కింపు కేంద్రాల సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు లెక్కించే ఈవీఎంలను ఎడా పెడా పడేయకుండా ఒక క్రమ పద్ధతిలో తీసుకురావడం, ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తదుపరి లెక్కింపు పూర్తి అయినట్లుగా,ఆయా ఈవీఎం లపై మార్కుచేస్తూ వెంటనే వాటిని సీల్ చేసి ఒక క్రమపద్ధతిలో సురక్షితంగా భద్రపర్చాలని సూచించారు. అనవసరంగా ఈవీఎం లను అటూ ఇటూ తరలించొద్దని,ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్మెంట్ సిస్టమ్, ఈటీపీ బిఎంఎస్, ను చక్కగా నిర్వహించాలని, వాటి లెక్కింపుకు సంబంధించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రకటించే విషయంలో ఏమాత్రము ఆలశ్యం చేయవద్దని, డిస్ప్లే బోర్డుల ద్వారా ఎప్పటి కప్పుడు ఖచ్చితమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించాలని సూచించారు.

**స్ట్రాంగ్ రూమ్ల వద్ద భద్రత కట్టుదిట్టం..**

స్ట్రాంగ్రూంల భద్రతకు 3 టైర్ భద్రతను ఏర్పాటు చేసినట్టు సీఈఓ తెలిపారు. ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమరాలను అమర్చామని, అభ్యర్థులు వారి తరుపున ప్రతినిధులు కానీ ఎప్పటికప్పుడు పరిశీలించుకునేందుకు డెక్ మెన్ హాలులో కంట్రోల్ రూంను కూడ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు లేదా వారి తరుపున ప్రతినిధులు కానీ రోజుకు రెండు సార్లు స్ట్రాంగ్ రూంలను ఫిజికల్ గా పరిశీలించుకునేందుకుఅవకాశం కల్పించినట్టు చెప్పారు.

పోలింగ్ తరువాత అక్కడక్కడ జరిగిన సంఘటనలు దృష్టిలో పెట్టుకొని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి 20 కంపెనీల బలగాలు కేటాయించటం జరిగిందని, రాష్ట్రంలో పికెట్లు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, ఘర్షణలకు పాల్పడే అనుమానితులను గుర్తించి వారిపై అవసరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని చెప్పారు.

# కుక్క కోసం 100కి ఫోన్

వరంగల్: వరంగల్లో ఓ వ్యక్తి పోలీసులకు ఊహించలేక షాక్ ఇచ్చాడు. ఇంట్లోకి చొరబడ్డ వీధి కుక్క ఎంతకు బయటికి వెళ్ళకపోవడంతో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసులను తన ఇంటికి రప్పించాడు. ఆ కుక్కను వారిచేతే బయటకు వెళ్ళగొట్టించాడు. ఈ విచిత్ర సంఘటన ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాజీపేటలో జరిగింది. ఇంటి యజమాని రాజేంద్రకుమార్ నిర్వాకం చూసిన పోలీసులు బిత్తరపోయారు.ఇంట్లోకి వీధి కుక్కలు చొరబడితే సహజంగా కర్ర పట్టుకొని బెదిరిస్తాం. ఏదో ఒక విధంగా ఆ కుక్కను భయపెట్టించి బయటకు వెళ్లగొడతాం. కానీ వరంగల్ గిర్మాజీపేటకు చెందిన రాజేంద్రకుమార్ అనే వ్యక్తి మాత్రం తన ఇంట్లోకి చొరబడ్డ కుక్కని వెళ్ళగొట్టడం కోసం డయల్ 100 కి ఫోన్ చేసి పోలీసులను తన ఇంటికి రప్పించాడు. ఆ కుక్క ఎంతకు బయటికి వెళ్లడం లేదని, తరిమితే పైపైకి వచ్చి కరిచేందుకు యత్నిస్తోంది. మీరే వెళ్లగొట్టాలంటూ పోలీసులకు సూచించడం ఇప్పుడు ఓరుగల్లు హాట్ టాపిక్ అయింది.

# బిర్యాని తిని ఆస్పత్రి పాలు

హైదరాబాద్: బిర్యానీ అయితే ఖచ్చితంగా ఉండాల్సిందే. రోజూ ఉండే బిజీబిజీ లైఫ్ పక్కన పెట్టి ఫ్యామిలీతో కలిసి మంచి ఫుడ్ తినాలని చాలా మంది అనుకుంటారు. అలా కొంతమంది బయటికి వెళ్లి తింటుంటే, మరికొందరు ఇళ్లలోనే వేడివేడిగా బిర్యానీ చేసుకుని ఆరగిస్తూ ఉంటారు. మార్కెట్లో దొరికే బాస్మతి రైస్ తీసుకొచ్చి నచ్చిన రీతిలో వండుకుని రుచులు ఇస్వాదిస్తూ ఉంటారు. అయితే మార్కెట్లో దొరికే బాస్మతీ రైస్ మంచిదేనా? రోగ్యానికి ఏమైనా హాని చేస్తుందా అని ఒక్కసారైనా ఆలోచించారా? అవును.. ఈ విషయం మీరు తప్పకుండా తెలుసుకోవాలి. ఎందుకంటే మనం ఎంతో ఇష్టం తింటున్న బాస్మతీ రైస్ నకిలీదా? అసలైనదా? అని గుర్తించాలి. లేదంటే ప్రాణాలకే ప్రమాదం అంటున్నారు వైద్య నిపుణులు.బిర్యానీ.. హైదరాబాద్ మహా నగరానికి పెట్టింది పేరు. ఇక్కడ వందల కొద్దీ హోటళ్లు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున బాస్మతి బియ్యం కొనుగోలు చేస్తుంటారు. వీటిని వండి వార్చి.. నగరం అంతా పెద్ద పెద్ద రెస్టారెంట్లలో వడ్డిస్తుంటారు. సాధారణంగా బాస్మతి బియ్యానికి ఒక రకమైన గులాబీ పూల వాసన వస్తుంది. వేడిగా తింటుంటే.. ఆ వాసన మనకు ఇంకా మంచి రుచిని అందించి ఇంకాస్త ఎక్కువ తినేలా చేస్తుంది. కానీ, ఇప్పుడు అదే మన పాలిట శాపంగా మారనుంది. ప్రస్తుతం చాలా చోట్ల రసాయనాల ద్వారా పండిస్తున్న బాస్మతి బియ్యం విక్రయిస్తున్నారు. ఈ బియ్యంలో అలాంటి పూల వాసన రావడం లేదు.దీంతో సహజంగా పండించిన బియ్యం మాదిరి మంచి వాసన కోసం బాస్మతి బియ్యంలో అత్యంత ప్రమాదకరమైన లిక్విడ్స్ కలుపుతున్నారు. ఈ లిక్విడ్ కలపడం వల్ల అది ఒరిజినల్ బాస్మతి బియ్యంలా సువాసనలు వెదజల్లుతుంది. చూడటానికి అచ్చం బాస్మతీ బియ్యం లాగే ఉండటం మాత్రమే కాకుండా.. రుచి కూడా అదే మాదిరి ఉంటుంది. దాంతో మనం ఏది సరైనదో.. కాదో.. తెలుసుకోలేకపోతున్నాం. హైదరాబాద్ నగరంలోని చాలా వరకు హోటళ్లలో ఇదే పరిస్థితి. అవగాహన లేకుండా ఇలాంటి ప్రమాదకరమైన బాస్మతీ రైస్ తింటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే అవుతుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి బిర్యానీ తిని ప్రజలు చాలా మంది హాస్పిటల్ పాలవుతున్నారు. వారిలో కొందరికి ఏకంగా ప్రాణాల మీదికొచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించి కట్టడి చేయాలని అధికారులను కోరుతున్నారు.

# అణగారిన వర్గాలకు ఒక న్యాయం,అగ్రవర్ణాలకు ఒక న్యాయమా?

**పగిడిపల్లి కారుణ్య మృతిపై సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించాలి**

**పి డి యస్ యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్**

కొత్తగూడెం:అణగారిన వర్గాలకు చెందిన ఒక ఆడబిడ్డ అనుమానాస్పదంగా మరణిస్తే ప్రభుత్వ యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా ఉండడం శోచనీయమని,అగ్రవర్ణాలకు ఏదైనా అన్యాయం జరిగితే నిందితులను ఎన్కౌంటర్లు చేసారని మరి కారుణ్య మృతిపై ఎందుకు సరైన విచారణ కూడా జరగడంలేదని ,అణగారిన వర్గాలకు ఒక న్యాయం,అగ్రవర్ణాలకు ఒక న్యాయమా అని పి డి యస్ యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, పి డి యస్ యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా మహాజన సోషలిస్ట్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లత ప్రశ్నించారు. బుధవారం సీపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యాలయంలో పి డి యస్ యూ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి శివ ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ భద్రాచలంలో మారుతీ మెడికల్ కళాశాలలో మే 23వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన కారుణ్య మరణం పట్ల అనేక అనుమానాలకు తావిస్తుందని, కారుణ్య హత్య పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని దీనికి మారుతి కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.




భద్రాచలం పట్టణం మారుతీ మెడికల్ కళాశాలలో గడిచిన 10 యేండ్ల కాలంలో దళిత ఆదివాసి కుటుంబాలకు చెందిన విద్యార్థినిలు లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతూ అత్యాచారాలకు గురవుతున్నారు అని వారు ఆరోపించారు. మారుతి కళాశాలలో గతంలో జరిగిన మరణాల పట్ల కళాశాల సిబ్బంది,యాజమాన్య పాత్ర పై అనేక అనుమానాలు ఉన్నా సమగ్ర విచారణ జరగక పోవడంతో ఈ నిర్లక్ష్యపు కారణాలవల్ల నేడు విద్యార్థిని కారుణ్య మృతికి బలమైన కారణాలు అయ్యాయని వారు తెలిపారు. గతంలో మాదిరిగానే కారుణ్య మృతి రహస్యాలను కూడా బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం తమకు ఉన్న ఆర్థిక రాజకీయ అంగ బలాన్ని ఆసరాగా చేసుకుని కారుణ్య మృతిని పలు విధాలుగా తప్పు దోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే భద్రాచలం పట్టణం నడి ఒడ్డున మా బిడ్డ మృతికి మారుతి కళాశాల యాజమాన్యమే కారణం అని కారుణ్య తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆవేదనకు లోనై మాకు న్యాయం చేయండి అని వేడుకున్న వారిని తప్పుడు మార్గంలో వారికి డబ్బు ఎరవేసి వారి నోరును కట్టివేశారని తెలిపారు. మీడియా సాక్షిగా వారు మా బిడ్డ మరణానికి మారుతి కళాశాల యాజమాన్యమే అని పలు రకాల వీడియోలు మన ముందు ఉన్నప్పటికీ రాత్రికి రాత్రే బాధితులతో తప్పుడు సాక్షాలను సృష్టించి బయటి సమాజానికి రాతపూర్వకంగా వారి బిడ్డ మరణానికి కళాశాల యాజమాన్యానికి ఏమి సంబంధం లేదని చెప్పించిన తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తుందని వారు తెలిపారు. బాధిత కుటుంబం క్రిస్టియన్ మతానికి సంబంధించిన వారని, వారి సాంప్రదాయం ప్రకారం మృతదేహాన్ని బాక్స్ లో పెట్టి పూడ్చి పెట్టాలి కాని భవిష్యత్తులో ఎటువంటి సాక్షాధారాలు లభించకుండా డెడ్ బాడీని మారుతి కళాశాల ఒత్తిడి మేరకు మంటల్లో దహనం చేశారని తెలిపారు. బాధిత కుటుంబం తో రహస్య ఒప్పందాలు చేసుకొని వారిని బయటికి రానియకుండా చేసినా జరిగిన సంఘటన అత్యంత దారుణమైనదని భవిష్యత్తులో మరొక విద్యార్థి ఇటువంటి ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోకుండా చర్యలు చేపట్టే విధంగా ఉండడం కోసమే పి డి ఎస్ యు,దళిత సంఘాలు కారుణ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలు చేసే న్యాయ పోరాటానికి భద్రాచలం పట్టణ ప్రముఖులు,ప్రజాసామిక వాదులు, మేధావులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ నాయకులు శివాజీ ,ఏజెన్సీ దళిత శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, అనుసూచిత్ జాతి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను,కొంచర్ల కుమారి, గద్దల కృష్ణవేణి,ఎస్కే సల్మా, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాదిగ,పింగళి నాగరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్పు చేస్తే క్రిమినల్ చర్యలు



**–అధిక శబ్ధం చేసే 86 ద్విచక్ర వాహన సైలెన్సర్లు ధ్వంసం**

**–జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

రాజన్న సిరిసిల్ల: ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసిన వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్పై క్రిమినల్ చర్యలు తీసుకోబడుతాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు జిల్లాలో గత నెల రోజుల వ్యవధిలో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల కంపెనీ సైలెన్సర్ స్థానంలో అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ఏర్పాటుపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధిక శబ్ధం చేసే 86 ద్విచక్ర వాహన సైలెన్సర్లను గుర్తించి,మరోమారు వినియోగించకుండా రోడ్ రోలర్ సాయంతో సిరిసిల్ల బై పాస్ ప్రాంతంలో ధ్వంసం చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను మార్పు చేయడం చట్టరిత్యా నేరమని,శబ్ద కాలుష్య నియంత్రణతో పాటు ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో వుంచుకోని అధికంగా శబ్దం చేసే ద్విచక్రవాహనలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టడం జరిగింది.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు తెలియజేయునది కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించుకోవాలి,ఎవరైన వాహనదారుడు సైలెన్సర్ మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నా వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .వాహణలకు సైలెన్సర్ మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నా వారి సమాచారం సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్.ఐ 8712656441 ,వేములవాడ ట్రాఫిక్ ఎస్.ఐ 8712656440 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.జిల్లాలో నిబంధనలు విరుద్ధంగా వాహనాలకు సైరన్లు బిగిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్లు బిగించిన 05 వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎస్పీ వెంట డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐరఘుపతి, ట్రాఫిక్ ఎస్.ఐ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# టెక్నాలజీకి గ్లోబల్ డెస్టినేషన్...

హైదరాబాద్: టెక్నాలజీకి గ్లోబల్ డెస్టినేషన్ మన హైదరాబాద్.. ఇప్పుడింత ఎలివేషన్ ఎందుకంటే.. ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్వేర్ కొలువులు చేసే వారి మెడపై కత్తి వేలాడుతుంటే.. మన భాగ్యనగరం మాత్రం.. కొత్తవారిని రిక్రూట్ చేసుకోవడంలో దుమ్ము రేపింది..ప్రస్తుతం ఐటీ రంగంపై జరుగుతున్న ప్రచారం ఏంటి? ఐటీ రంగం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ప్రతి కంపెనీలో ఉద్యోగాలను తొలగిస్తున్నారు. రిక్రూట్ చేసుకునే కంపెనీలు కూడా చాలా ఆచి తూచి చేపడుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితి.. ఇండియాలో అయితే జాబ్ రిక్రూట్మెంట్స్ ఏకంగా 4 శాతం తగ్గాయి. బట్.. మన హైదరాబాద్ సిట్యువేషన్ కంప్లీట్ రివర్స్.. ఐటీ జాబ్స్ హైరింగ్లో దూసుకుపోతుంది. ఇండియా సిలికాన్ వ్యాలీగా పిలిచే బెంగళూరు కంటే ముందుంది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మధ్య కాలంలో హైదరాబాద్ ఐటీ ఉద్యోగాల పోస్టింగ్స్ .. 41.5 శాతం పెరిగింది? అదే బెంగళూరులో కేవలం 24 శాతం మాత్రమే..ఐటీ ఉద్యోగాలు ఆశించే వారికి ఈ రెండు నగరాలే హైలైట్గా కనిపిస్తున్నాయిజాబ్ మ్యాచింగ్,జాబ్ హైరింగ్ సంస్థ ఇండీడ్.. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ మధ్య కాలంలో జాబ్ పోస్టింగ్స్ అండ్ జాబ్ క్లిక్స్ నుంచి ఈ డేటాను కలెక్ట్ చేసి అనలైజ్ చేస్తే ఈ వివరాలు తెలిశాయి.. అంతేకాదు హైదరాబాద్లో ఇంపార్టెంట్స్ ఇచ్చేవారి సంఖ్య ఏకంగా 161 శాతం పెరగగా.. బెంగళూరుపై ఇంట్రెస్ట్ చూపేవారి సంఖ్యలో 80 శాతం పెరిగింది. ఈ ట్రెండ్ను చూస్తే హైదరాబాద్ టెక్ ఎకో సిస్టమ్ ఎదుగుతుందని క్లియర్ కట్గా అర్థమవుతోంది.మరి హైదరాబాద్లోనే ఎందుకు రిక్రూట్మెంట్స్ ఎందుకు పెరుగుతున్నాయి? దీనికి మూడు రిజన్స్ ఉన్నాయి.. ఫస్ట్ రిజన్.. వల్డ్ క్లాస్ ఇన్ఫ్రాస్టక్చర్.. యస్.. హైదరాబాద్లో ఒక్కసారి టూర్ వేసిన వారికి ఇది ఈజీగా అర్థమవుతోంది.. మల్టీ నేషనల్ కంపెనీలకు కావాల్సిన అన్ని వసతులు మన హైదరాబాద్లో వడ్డించిన విస్తరిలాగా అందుబాటులో ఉంటాయనడంలో ఎలాంటి డౌట్స్ లేవు.. సెకండ్ రిజన్.. హైల్లీ స్కిల్డ్ టాలెంట్ అందుబాటులో ఉండటం. తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రెస్టేజీయస్ ఇన్స్టిట్యూట్స్ ఉన్నాయి మనకు.. ఇక్కడి నుంచి సూపర్ టాలెంట్తో పాటు.. హైల్లీ స్కిల్డ్ స్టూడెంట్స్ను హైర్ చేసుకుంటున్నారు రిక్రూటర్స్.. దీంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వారందరి చూపు హైదరాబాద్వైపే ఉండటం కూడా మరో రీజన్.. ఇక థర్డ్ రీజన్.. ఫుల్గా సపోర్ట్ చేసే గవర్నమెంట్.. హైదరాబాద్లో కంపెనీ పెట్టాలని ఎవరైనా అనుకుంటే చాలు సింగిల్ విండో పద్ధతిలో పర్మిషన్స్ దొరకుతాయి.. ఇది కూడా హైదరాబాద్లో కంపెనీలను ఎస్టాబ్లిష్ చేసేందుకు ఓఔఅలను అట్రాక్ట్ చేస్తోంది. రిక్రూట్మెంట్స్ పెరుగుతున్నాయి ఓకే.. బట్ ఏఏ టెక్నాలజీకి సంబంధించి రిక్రూట్ చేసుకుంటున్నారు..? ప్రస్తుతం ట్రెండింగ్లో ఉన్న టాప్ ఫైవ్ టెక్నాలజీలు ఏంటి? ఈ డిటెయిల్స్ ఓ సారి చూద్దాం.. అనాలసిస్ స్కిల్స్.. 5.51 పర్సెంట్.. అజైల్ 5.39 పర్సెంట్.. ంఖఎ.. 4.5 పర్సెంట్ జావా స్క్రిప్ట్.. 4 పర్సెంట్ ాఖిఒ.. 4 పర్సెంట్.. సో సాఫ్ట్వేర్ రంగంలో సెటిల్ అవ్వాలనుకుంటున్న వాళ్లు వీటిపై కాస్త ఫోకస్ చేయండి.. ఇంకా బాగా సెటిల్ అవ్వాలనుకుంటున్న వాళ్లు ఏఐ టెక్నాలజీలపై ఫోకస్ చేస్తే.. భారీ జీతాలతో ఉద్యోగాలు సంపాదించవచ్చని చెబుతున్నారు ఐటీ ఎక్స్పర్ట్స్.. ఇప్పుడు హైదరాబాద్ మరో అడుగు ముందుకు వేయబోతుంది. హైటెక్ సిటీ తరహాలో మరో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సిటీని ఏర్పాటు చేయాలని గవర్నమెంట్ డిసైడ్ అయ్యింది. ఔటర్ రింగ్ రోడ్డుకు ప్యారలల్గా 200 ఎకరాల భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. 2030 వరకు ఏఐ మార్కెట్లో 37.3 పర్సెంట్ వృద్ధి రేటుతో విస్తరిస్తుందని అంచనాలు ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికత, పరిశోధనా కేంద్రాలు,విద్యాసంస్థలు ఇందులో భాగం కానున్నాయి. ఈ సిటీలో ఇంక్యుబేటర్లు, స్టార్ట్–అప్లు, కార్పొరేట్ల కోసం గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్ ఇలా అన్ని అందుబాటులో ఉంచాలని చూస్తున్నారు. ఓవరాల్గా గోల్ ఏంటంటే? హైదరాబాద్ను ఏఐ క్యాపిటల్గా చేయడం. సో భాగ్యనగరం చారిత్రక నగరంగా ఎంత ప్రాముఖ్యత సంపాదించుకుందో హైదరాబాద్గా గ్లోబల్ డెస్టినేషన్గా అంతే పేరు సంపాదించుకోంది.. సో.. ఖతీనీబీట బినీ ఎవ బజీఎ .. హమ్ హైదరాబాద్ వాలే.

# అందరి దృష్టి పాకిస్థాన్‌లోని హిందువులపైనే..! టీమిండియా క్రికెటర్ పోస్ట్ వైరల్..!




గాజాలోని రఫాలో ఇజ్రాయెల్ దాడులపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో పలువురు సెలబ్రిటీలు 'అందరి దృష్టి రఫా వైపే' అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్న విషయం తెలిసిందే. పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు పాలస్తీనాకు మద్దతు తెలిపుతూ మారణకాండను ఖండించారు. ఇదిలా ఉండగా.. భారత క్రికెటర్ రాహుల్ తెవాటియా చేసిన పోస్టల్ వైరల్‌గా మారింది. అందరూ గాజాలో ఇజ్రాయెల్ దాడులపై నిరసన గళమెత్తగా.. ఈ క్రికెటర్ పాక్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను లేవనెత్తాడు.
'అందరి దృష్టి పాకిస్థాన్‌లోని హిందువులపై ఉంది' అంటూ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టాడు. '%ూశ్రీశ్రీ జుఎవం శీఅ నఱఅనబం ఱఅ ూఖనఱఱర్ఖఅ%' అంటూ పెట్టిన స్టోరీ వైరల్ అవుతుండగా.. తమదైన శైలిలో నెటిజన్స్ స్పందిస్తున్నారు. క్రికెటర్ పోస్టుపై నెటిజన్స్ పలువురు సానుకూలంగా స్పందించారు. దాయాది దేశంలో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ధైర్యంగా లేవనెత్తడంపై పలువురు ప్రశంసించారు. భారత్‌లోని ప్రముఖులంతా యంగ్ క్రికెటర్‌ను చూసి నేర్చుకోవాలని హితవులు పలుకుతున్నారు. ఇదిలా ఉండగా.. రఫాలోని ఓ శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది.
ఈ ఘటనలో పిల్లలు, మహిళలు సహా 45 మంది సాధారణ పౌరులు దుర్మరణం చెందారు. ఈ ఘటనపై యావత్ ప్రపంచదేశాలు ఖండించాయి. ఈ క్రమంలోనే భారత్‌కు సంబంధించిన ప్రముఖులు సైతం పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తూ 'అందరి దృష్టి రఫాపైనే ఉంది' అంటూ పోస్టులు చేస్తున్నారు. టీమిండియా క్రికెటర్ రోహిత్ శర్మ సతీమణి రితికా పోస్ట్ చేయగా.. ఆమెను విపరీతంగా ట్రోల్ చేశారు. దాంతో ఆమె పోస్ట్‌ను డిలీట్ చేశారు. అలాగే హీరోయిన్లు త్రిష, సమంత, మాళవికా మోహనన్, రష్మిక, దుల్కర్ సల్మాన్, పార్వతి తిరువొతు, అమీ జాక్సన్, అలియా భట్, కరీనాకపూర్, ప్రియాంకా చోప్రా, వరుణ్ ధావన్, సోనాక్షి సిన్హా, దియా మీర్జా, త్రిప్తి డిమ్రి సైతం సంఘీభావం ప్రకటించిన వారిలో ఉన్నారు.

# సింధుకు ఆరో ఓటమి.. ఒలింపిక్స్ సంగతేంటీ..?



బ్యాడ్మింటన్ సూపర్ టోర్నీ టైటిల్ కోసం రెండేండ్లుగా నిరీక్షిస్తున్నతెలుగు తేజం పీవీ సింధు(%్రూఎ ూఱఅఅస్త్రబ%)కు మరో ఓటమి ఎదురైంది. ప్రతిష్టాత్మక సింగపూర్ ఓపెన్ 16వ రౌండ్‌లోనే ఆమె ఇంటిదారి పట్టింది. చిరకాల ప్రత్యర్థి కరోలినా మరిన్ చేతిలో చిత్తుగా ఓడి ఇంటిదారి పట్టింది. వారం క్రితమే 'మలేషియా మాస్టర్స్'(%మీఖశ్రీఖఎంఱఖ మీఖర్వతీం%)లో రన్నరప్‌గా నిలిచిన సింధు.. సింగపూర్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అంచనాలకు తగ్గట్టే అలవోకగా రెండో రౌండ్‌కు చేరిన ఆమె ప్రీక్వార్టర్స్ దశకు ముందే నిష్క్రమించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలి సెట్ గెలుపొందిన సింధు అనూహ్యంగా తడబడింది. మరిన్ ధాటికి వరుసగా రెండు సెట్లలో చేతులెత్తేసి 21-11, 11-21, 20-22తో మ్యాచ్ చేజార్చుకుంది. 2018 నుంచి స్పెయిన్ షట్లర్ మరిన్.. సింధుకు కొరకరాని కొయ్యలా మారింది. దూకుడైన ఆటతో ఆమెపై పైచేయి సాధిస్తూ వస్తోంది. ఈ ఆరేండ్ల కాలంలో మరిన్ చేతిలో సింధు ఆరోసారి ఓడిపోయింది. దాంతో, ఒలింపిక్ విజేత అయిన సింధు ఈ ఏడాది ప్యారిస్‌లో పతకం గెలవడం కష్టమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే.. ఆమె మాత్రం ఒలింపిక్స్ ముందు పాజిటివ్ దృక్పథంతో ఉండాలని అనుకుంటున్నానని తెలిపింది.

నా లక్ష్యమదే

'మ్యాచ్ ఆసాంతం గొప్పగా సాగింది. అయితే.. మూడో సెట్‌లో నేను ఒక సైడ్ ఆడడం దెబ్బతీసింది. ఎక్కువ పాయింట్లు గెలవాలనుకున్నా. కానీ, ఈ రోజు మరిన్‌ది. ఒకదశలో 20-20 పాయింట్లు వచ్చాక ఎవరైనా గెలిచే చాన్స్ ఉంది. నిజంగా ఇది చాలా మంచి మ్యాచ్. సింగపూర్ ఓపెన్ ఓటమితో మరో టోర్నీకి సిద్ధమవుతున్నా. మరో నెలరోజుల్లో ఒలింపిక్స్ ఉన్నాయి. అందుకని పాజిటివ్‌గా ఉండాలని, ఈ మ్యాచ్‌ల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని భావిస్తున్నా. మానసికంగా, శారీరకంగా ధ్రుడంగా ఉండడంపై దృష్టి పెడుతున్నా' అని భారత స్టార్ షట్లర్ వెల్లడించింది.

# ప్రాక్టీస్.. ప్రాక్టీస్

**- టి20 ప్రపంచకప్‌కు టీమిండియా సిద్ధం**
**- 1న బంగ్లాదేశ్‌తో ఏకైక ప్రాక్టీస్ మ్యాచ్**




న్యూయార్క్: ఐసిసి టి20 ప్రపంచకప్‌కు టీమిండియా ఆటగాళ్లు సిద్ధమౌతున్నారు. జట్టు సభ్యులంతా న్యూయార్క్‌కు చేరుకోవడంతో బుధవారం ఆటగాళ్లంతా ప్రాక్టీస్‌లో నిమగమయ్యారు. టి20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియా ఏకైక వార్మప్ మ్యాచ్‌ను బంగ్లాదేశ్‌తో జూన్ 1న తలపడనుంది. ఈ మ్యాచ్ న్యూయార్క్ వేదికగా జరగనుంది. ప్రాక్టీస్ సందర్భంగా జట్టు బలాబలాలు, బలహీనతలు, అవకాశాల గురించి కెప్టెన్, కోచ్ ప్రధానంగా దృష్టి సారించారు. ఇక టీమిండియా టి20 ప్రపంచకప్‌లో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. చాలాకాలంలో టీమిండియాకు అందని ద్రాక్షలా ఉన్న ఐసిసి ట్రోఫీని ఈసారి తప్పక సాధించాలన్న దృఢ సంకల్పంతో ఆటగాళ్లంతా కసరత్తు చేస్తున్నారు. ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప (డబ్ల్యుటిసి) ఫైనల్లోకి రెండుసార్లు ప్రవేశించిన టీమిండియా రెండుసార్లు ఫైనల్లోకి చతికిలపడి రన్నరప్‌కే పరిమితమైంది. అలాగే 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన టీమిండియా.. ఆసీస్ చేతిలో ఓడింది. ఇక 2022 టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడంలో టీమిండియా విఫలమైంది. ఈ క్రమంలో 9వ టి20 ప్రపంచకప్‌లో టీమిండియా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న అమెరికా, వెస్టిండీస్ పిచ్‌లు పేసర్లకు స్వర్గధామాలు. ఈ ఏడాది జనవరిలో బెంగళూరు వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన టి20లో టీమిండియా 212 పరుగుల భారీ స్కోర్‌ను కాపాడుకోలేకపోయింది. చివరకు సూపర్ ఓవర్లో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఈ క్రమంలో టి20 ఫార్మాట్‌లో భారీస్కోర్లు నమోదైనా ఫలితం ఏ నిమిషంలోనైనా తరుమారయ్యే అవకాశముంది. ఆటగాళ్లు లేక మైదానంలోకి కోచ్, చీఫ్ సెలక్టర్ కూడా.. మరో మూడురోజుల్లో టి20 ప్రపంచకప్ ప్రారంభం కానుండగా.. ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇంకా న్యూయార్క్‌కు చేరుకోలేదు. దీనికి ప్రధాన కారణం కొందరు ఆటగాళ్లు ఐపిఎల్‌లో ఆడటం కాగా.. మరికొందరు గాయాలబారిన పడడం. బుధవారం నమీబియాతో జరగాల్సిన వార్మప్ మ్యాచ్‌కు ఆస్ట్రేలియాకు కనీసం 11మంది కూడా అందుబాటులో లేకుండాపోయారు. దీంతో నమీబియాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో ఆసీస్ చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీ, ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్ డొనాల్డ్ మైదానంలోకి దిగారు. వారితోపాటు ఇతర సహాయక సిబ్బంది కూడా ఫీల్డింగ్ చేశారు. జూన్ 5లోగానే కమిన్స్‌తోపాటు ఇతర క్రికెటర్లు విండీస్‌కు చేరుకుంటారు. ఆ రోజే ఆస్ట్రేలియా జట్టు ఒమన్‌తో గ్రూప్ లీగ్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఇక ఐపిఎల్‌లో పెద్దగా ఆకట్టుకోని డేవిడ్ వార్నర్ తన మునుపటి ఫామ్‌ను అందుకున్నాడు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఏడు వికెట్ల తేడాతో నమీబియాను చిత్తుచేసింది. పోర్ట్‌స్పెయిన్ వేదికగా జరిగిన వార్మప్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 119పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు 10ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. వార్నర్(54నాటౌట్)అర్ధసెంచరీకి తోడు టిమ్ డేవిడ్(23), వేడ్(12నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. నమీబియా బ్యాటర్లలో వికెట్ కీపర్ గ్రీన్(36) బ్యాటింగ్‌లో రాణించగా.. ఆసీస్ బౌలర్లు జంపాకు మూడు, హేజిల్ వుడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. బియాను 119/9 స్కోరుకే కట్టడి చేసిన ఆసీస్.. లక్ష్య ఛేదనలో కేవలం 10 ఓవర్లలోనే పూర్తి చేసింది. డేవిడ్ వార్నర్ 21 బంతుల్లో 54 పరుగులు చేశాడు. టిమ్ డేవిడ్ (23), మ్యాథ్యూ వేడ్ (12లి) దంచేశారు. ఈ మ్యాచ్ ఫీల్డింగ్ సమయంలో కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయం కారణంగా మధ్యలోనే డగౌట్‌కు వెళ్లాడు. అయితే, తన ఇంజూరీ పెద్ద సమస్య కాదని ఆ తర్వాత మార్ష్ వెల్లడించాడు.

# ఈసారైనా.. రోహిత్, కోహ్లీకి ఐసీసీ కప్పు కల నెరవేరేనా?

దశాబ్దకాలంగా భారత క్రికెట్ జట్టు బ్యాటింగ్ భారాన్ని మోస్తున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ (రోకో)కి 'ఐసీసీ కప్పు' కలను నిజం చేసుకునేందుకు మరో అవకాశమొచ్చింది.
2007లో భారత్ తొలి టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో హిట్‌మ్యాన్ ఉండగా.. 2011లో వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన టీమ్‌లో కోహ్లీ ఉన్నాడు. విడివిడిగా ఈ ఇద్దరికీ ఇవే ఆఖరి ఐసీసీ ట్రోఫీలు. 2013లో భారత్ గెలిచిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో 'రోకో' ఉన్నప్పటికీ అప్పటికింకా వీళ్లు 'ధోనీ నీడ'లోనే ఉన్నారు. ఆ తర్వాత మహేంద్రుడి నుంచి సారథ్య పగ్గాలు అందుకున్న కోహ్లీ గానీ.. విరాట్ వారసుడిగా వచ్చిన రోహిత్ గానీ ఐసీసీ ట్రోఫీ కలను నిజం చేయలేకపోయారు. 2012, 2014, 2016, 2021, 2022 పొట్టి ప్రపంచకప్‌లలో పలుమార్లు ట్రోఫీకి చేరువగా వచ్చినా వీరికి నిరాశే ఎదురైంది. గతేడాది స్వదేశంలో ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో 'మెన్ ఇన్ బ్లూ' ప్రదర్శన చూశాక రోహిత్-కోహ్లీ కలిసి ఐసీసీ ట్రోఫీని ముద్దాడతారని భావించినా తుదిపోరులో టీమ్‌ఇండియా బోల్తా కొట్టడంతో కోట్లాది అభిమానుల గుండె బద్దలవడంతో పాటు ఈ ఇద్దరి కల కూడా చెదిరింది.

# వన్డేల్లో వంద.. చరిత్ర సృష్టించిన ఇంగ్లండ్ స్పిన్నర్




మహిళా క్రికెట్‌లో ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్ చరిత్ర సృష్టించింది. వన్డేల్లో అత్యంత వేగంగా వంద వికెట్లు తీసిన బౌలర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పింది. పాకిస్థాన్ తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో సోఫీ ఈ ఫీట్ సాధించింది. డేంజరస్ నష్రా సంధును ఔట్ చేసి వందో వికెట్ ఖాతాలో వేసుకుంది.
ఈ ఆల్‌రౌండర్ 63 ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయికి చేరుకొని.. ఆస్ట్రేలియా బౌలర్ క్యాథరిన్ ఫిట్జ్‌ప్యాట్రిక్ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేసింది. ఫాస్ట్ బౌలర్ అయిన క్యాథిరన్ 64 ఇన్నింగ్స్‌ల్లో వంద వికెట్లతో మెరిసింది. కౌంటీ గ్రౌండ్‌లో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ 302 రన్స్ కొట్టింది. నాట్ సీవర్ బ్రంట్(124 నాటౌట్) సెంచరీతో కదంతొక్కగా.. అలిసే క్యాప్సే(39 నాటౌట్) చివర్లో మెరుపులు మెరిపించింది.

4.1 ఓవర్లలో.. 15 పరుగులే

అనంతరం భారీ ఛేదనలో సోఫీ తిప్పేసింది. మునీబా అలీ(47) వికెట్‌తో వేట మొదలెట్టిన ఆమె.. అలియా రియాజ్(36), నశ్రా సంధు(0)ను ఔట్ చేసింది. 4.1 ఓవర్లలో సోఫీ 15 పరుగులే ఇచ్చి మూడు ఇకెట్లు తీయడంతో ఇంగ్లండ్ 178 పరుగుల తేడాతో గెలుపొందింది. దాంతో, హీథర్ నైట్ కెప్టెన్సీలోని ఇంగ్లండ్ 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది

# రెండు రోజుల్లో వరల్డ్ కప్.. పసికూనకు షాకిచ్చిన ఐసీసీ




తొలిసారి టీ20 వరల్డ్ కప్ ఆడుతున్న ఉగాండా జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్‌భారీ షాకిచ్చింది. మరో రెండు రోజుల్లో ప్రపంచ కప్ మొదలవ్వనుందనగా ఆ టీమ్ జెర్సీ పై తిరకాసు పెట్టింది.
ఆ జట్టు జెర్సీపై స్పాన్సర్ల లోగో కనిపించడం లేదని వెంటనే డిజైన్ మార్చుకోవాలని సూచించింది. దాంతో, చేసేదేమీలేక ఉగాండా క్రికెట్ బోర్డు జెర్సీలో మార్పులు చేసింది.
తొలుత ఉగాండా బోర్డు పసుపు రంగు జెర్సీని విడుదల చేసింది. భుజాలపై తమ దేశ జాతీయ పక్షి ఆనవాళ్లకు గుర్తుగా బూడిద రంగు కొంగను పోలిన రంగులతో జెర్సీ తయారు చేసింది. కానీ, ఈకల రంగు రంగు కారణంగా వరల్డ్ కప్ స్పాన్సర్ల లోగో అంతగా హైలైట్ కావడం లేదు.
దాంతో, ఉగాండా జట్టు జెర్సీపై అభ్యంతరం తెలిపిన ఐసీసీ చేయాల్సిన మార్పులు చెప్పింది. దాంతో, భుజాలపై ఉన్న తమ జాతీయ పక్షి రంగును మొత్తానికి ఎత్తేసి.. పూర్తిగా పసుపు రంగు జెర్సీని ఆవిష్కరించింది. ఇదే జెర్సీతో ఉగాండా మెగా టోర్నీలో ఆడనుంది.
ఉగాండా వరల్డ్ కప్ స్క్వాడ్ : బ్రియాన్ మసబ(కెప్టెన్), సిమన్ సెసాజీ, రోజెర్ ముకాసా, కాస్మస్ కీవుట, దినేశ్ నక్రాని, ఫ్రెడ్ అచెలామ్, కెన్నెత్ వైస్వా, అల్పేశ్ రమ్జానీ, ఫ్రాంక్ సుబుగ, మెహ్రీ సెన్యొడో, బిలాల్ హస్సున్, రాబిన్సన్ ఒబుయ, రియాజట్ అలీ షా, జుమా మియాజీ, రోనక్ పటేల్.

# 'దేవుడా ధన్యవాదాలు'.. పంత్ ఎమోషనల్ పోస్ట్



భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం కోసం ఎంతో ఆతృతగా ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్‌లో తనదైన మెరుపులతో జట్టుకు చిరస్మరణీయ విజయాలందించాలని ఉవ్విళ్లూరుతున్నాడు.
16 నెలల తర్వాత టీమిండియా జెర్సీ వేసుకున్న పంత్ ఆ దేవుడికి ధన్యవాదాలు తెలిపాడు. వరల్డ్ కప్ జెర్సీ వేసుకున్న సంతోషంలో పంత్ దైవాన్ని యాది చేసుకున్నాడు. తన మనసులోని మాటల్ని వ్యక్తపరుస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ డాషింగ్ బ్యాటర్ ఓ పోస్ట్ పెట్టాడు. పంత్ తన పోస్ట్‌లో పేసర్లు బుమ్రా, సిరాజ్, మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌లతో దిగిన ఫొటోల్ని పెట్టాడు. 'భగవంతుడా నీకు ధన్యవాదాలు. ఈ జెర్సీ వేసుకోన్నందుకు నా మనసంతో కృతజ్ఞతా భావం, సంతోషం, గర్వంతో నిండిపోయింది. దేశానికి ప్రాతినిధ్యం వహించడం కంటే గొప్ప ఫీలింగ్ ఇంకేముంటుంది' అని పంత్ తన పోస్ట్‌కు క్యాప్షన్ రాశాడు. ప్రస్తుతం ఆ పోస్ట్ ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.

మంచానికే పరిమితమైన వేళ

ఏదాదిన్నర క్రితం జరిగిన కారు యాక్సిటెంట్ పంత్ జీవితాన్ని మార్చేసింది. అప్పటిదాగా క్రికెట్ ఆటే ప్రపంచగా బతికిన అతడు ఒక్కసారిగా మంచానికే పరిమితమయ్యాడు. యాక్సిడెంట్ సమయంలో దాదాపు చావు నోట్లో తలపెట్టి వచ్చిన పంత్.. అనంతరం మోకాలి సర్జరీ చేయించుకున్నాడు. ఆ తర్వాత నేషనల్ క్రికెట్ అకాడమీ (%చీజూా%)లో కఠిన కసరత్తులు చేసి ఐపీఎల్ పదిహేడో సీజన్‌తో మైదానంలోకి దిగాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సారథి ఆడిన పంత్ దూకుడైన ఆటతో, వికెట్ల వెనకాల స్టన్నింగ్ క్యాచ్‌లతో అభిమానులను అలరించాడు. పంత్ 13 ఇన్నింగ్స్‌ల్లో రెండు అర్ధ శతకాలతో 5446 రన్స్ కొట్టాడు. ఐపీఎల్ ప్రదర్శనతో సంజూ శాంసన్‌తో పాటు వికెట్ కీపర్‌గా వరల్డ్ కప్ బృందంలో ఈ లెఫ్ట్ హ్యాండర్ చోటు దక్కించుకున్నాడు. అయితే.. వీళ్లలో ఎవరు తుది జట్టులో ఉంటారు? ఎవరెన్ని మ్యాచ్‌లు ఆడుతారు? అనేది మరో మూడు రోజుల్లో తెలియనుంది. మెగా టోర్నీకి ముందు టీమిండియా జూన్ 1న బంగ్లాదేశ్‌తో వామప్ మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత వరల్డ్ కప్ లీగ్ మ్యాచుల్లో భాగంగా జూన్ 5న ఐర్లాండ్‌తో%ూ% జూన్ 9న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో రోహిత్ సేన అమీతుమీ తేల్చుకోనుంది.

# భారత్-పాక్ మ్యాచ్‌కు ఉగ్రముప్పు!




న్యూయార్క్: మరో మూడు రోజుల్లో వెస్టిండీస్/అమెరికా వేదికలుగా మొదలుకాబోయే టీ20 వరల్డ్‌కప్‌లో 'హై ఓల్టేజ్ మ్యాచ్'గా భావిస్తున్న భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉగ్ర ముప్పు పొంచి ఉన్నట్టు తెలుస్తోంది. మూడువారాల క్రితమే ట్రినిడాడ్ అండ్ టొబాగో (వెస్టిండీస్‌లో ఓ దీవి) ప్రధాని సైతం ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేయగా తాజాగా ముష్కర మూకలు దాయాదుల పోరుకు ముప్పు తలపెట్టనున్నట్టు వార్తలు వస్తున్నాయి.
'ఐసిస్' అండతో రెచ్చిపోతున్న ఓ ఉగ్ర మూకా ఆన్‌లైన్ వేదికగా 'మీరు మ్యాచ్‌ల కోసం వేచి చూస్తున్నారు. మేము మీకోసమే ఎదురుచూస్తున్నాం' అని ఓ వ్యక్తి ఆయుధాలు ధరించి ఉన్న ఫొటోను షేర్ చేసింది. అదే ఫొటోలో 'నసావు స్టేడియం.. 09/06/2024' అని కూడా ఉండటం ఆందోళనకు దారితీసింది. జూన్ 9న ఇదే స్టేడియంలో రోహిత్ సేన..పాక్‌తో తలపడనుంది.

# 31 నుంచి హెచ్‌సీఏ శిక్షణా శిబిరాలు



31 నుంచి హెచ్‌సీఏ శిక్షణా శిబిరాలుహైదరాబాద్: క్యురేటర్స్, అంపైర్స్, స్కోరర్స్‌కు నిర్వహించనున్న శిక్షణ శిబిరాల తేదీలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రధాన కార్యదర్శి దేవ్‌రాజ్ వెల్లడించారు. నిర్ణీత గడువు లోపు ధరఖాస్తులు పంపించిన అభ్యర్థులను మాత్రమే వర్క్‌షాప్స్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈనెల 31 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు వారం రోజుల పాటు క్యురేటర్స్ వర్క్‌షాప్, స్కోరర్లకు వచ్చే నెల 3 నుంచి 4వ తేదీ వరకు ఉదయం 8.15 గంటల నుంచి రెండ్రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. అంపైర్లకు జూన్ 1వ తేదీన ఉదయం 8.15 గంటల నుంచి ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించనుండగా, ఇందులో హెచ్‌సీఏ రిజిస్టర్ అంపైర్లు, స్కోరర్లు, వీడియో అనాలిసిస్టులు కూడా పాల్గొనవచ్చు. వర్క్‌షాప్స్‌లో పాల్గొనేవారికి ఉదయం అల్పాహారం, మధ్యహ్నం భోజనం, సాయంత్రం హై-టీ అందించనున్నామని దేవ్‌రాజ్ తెలిపారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**